

GET THE LATEST UPDATES AND NEWS DIRECTLY THROUGH THE WHATSAPP

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 124 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 మంగళవారం 22 జూలై 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




1959 - 2024

దివంగత షఫీఉల్లా ఖాన్

మాజీ మేనేజింగ్ ఎడిటర్



# యూరియా కొరత లేకున్నా కొందరు అసత్య ప్రచారాలు

## ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి

### భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడండి అంటువ్యాధులు ప్రబలకుండా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి 25 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూలై21 (సమయజ్యోతి):**

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేయాలని వారికి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు 21 శాతం వర్షపాతం నమోదు అయ్యిందని.. ఇది తక్కువ వర్షపాతమని సీఎం పేర్కొన్నారు. అయితే గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని.. అన్ని విభాగాలను అప్రమత్తం చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 150 బృందాలను ఏర్పాటు- చేశామని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సమన్వయం చేసుకుని ముందుగానే బృందాలను పంపిస్తున్నామని చెప్పారు. పోలీస్ కమిషనరేట్లల్లోని ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో ఉండాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాల్లో పిడుగుపాటు- కారణంగా జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలని వారికి వివరించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా ఐటీడీఏ ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటు-లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం సైతం అప్రమత్తంగా ఉండాలని హుకుం జారీ చేశారు. ఆ క్రమంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అజాగ్రత్తగా ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. మిగతా 2లో

# ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలి

## ట్రంప్ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలి

## రాజ్యసభలో విపక్షనేత ఖర్గే డిమాండ్



**న్యూఢిల్లీ,జూలై21(సమయజ్యోతి):**

వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభల కార్య కలాపాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఇటీవలి భారత్-పాకిస్తాన్ సంఘర్షణ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన శాంతి ఒప్పందం వాదనలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏప్రిల్ 22న జరిగిన పెహల్గామ్ దాడి గురించి మాట్లాడుతూ, ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి జరిగి నెలలు గడిచినా, ఆ ఉగ్రవాదులను ఇప్పటి వరకు పట్టుకోలేదు, వారి గురించి సమాచారం కూడా లేదన్నారు. మా పార్టీ మాత్రమే కాదు, అన్ని పార్టీలు దేశాన్ని బలోపేతం చేయడానికి, సైన్యానికి ధైర్యం నింపడానికి మద్దతు ఇస్తున్నట్లు- తెలిపారు. కానీ, ఇప్పుడు అసలు పెహల్గామ్ దాడి జరిగిన దాని గురించి స్పష్టమైన సమాచారం కావాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఇం-టె-లిజెన్స్ విషయంలో లోపం జరిగిందని లెఫ్టినెంట్ గవర్నర్ చెప్పారు. ఆ క్రమంలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రభుత్వం ప్రపంచానికి, భారత ప్రజలకు చెప్పింది. కానీ, ఆ తర్వాత ఏమైంది, ఏం జరిగిందో సమాచారం ఇవ్వాలని ఖర్గే కోరారు.



# ఆదివాసీల ఆందోళనతో దిగొచ్చిన ప్రభుత్వం

## జివో 49ని నిలిపివేస్తూ సిఎం రేవంత్ నిర్ణయం

## సిఎంను కలసిన మంత్రి సీతక్క తదితరులు

**హైదరాబాద్,జూలై21(సమయజ్యోతి):**

ఆదిలాబాద్ జిల్లాలో కుమురం భీం కన్జర్వేషన్ కారిడార్ కోసం ఇచ్చిన జీవో 49ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఆదివాసీల అనుమానాలు, ఆందోళనల నేపథ్యంలో జీవో 49 నిలిపివేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తడోబా -టైగర్ రిజర్వ్, కవ్వాల్ -టైగర్ రిజర్వ్‌లను కలుపుతూ మధ్యలో ఉన్న ప్రాంతంలో కుమురంభీం కన్జర్వేషన్ కారిడార్ ఏర్పాటు- చేస్తూ గత నెల 30న ప్రభుత్వం జీవో 49 విడుదల చేసింది. ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లలో లక్షా 49 వేల హెక్టార్లను టైగర్ రిజర్వులోకి మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, జీవో 49ను రద్దు చేయాలని ఆదివాసీ ప్రజలతో పాటు- మంత్రి సీతక్క, ఆదివాసీ ఎమ్మెల్యేలు కోరారు.

# విజయోత్సవ వేళ పార్లమెంట్ సమావేశాలు




## ఉగ్రవాదం,నక్సలిజం నుంచి విముక్తి

## ఆపరేషన్ సిందూర్‌తో పాక్ ఉగ్రమూకల ధ్వం మైన సైనిక శక్తిని ప్రపంచం గుర్తించింది అంతరిక్షంలో త్రివరణ పతాకం ఎగరేసిన శుభాంశు శుక్లా పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూలై21(సమయజ్యోతి):**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారతదేశం ఉగ్రవాదం, నక్సలిజం వంటి సమస్యలను ఎదుర్కొంటోందని ప్రధాని మోడీ అన్నారు. నేడు నక్సలిజం, మావోయిజం ప్రభావం వేగంగా తగ్గుతోందని చెప్పారు. దేశ భద్రతా దళాలు ఉత్సాహంతో విజయం వైపు పయనిస్తున్నాయని, వందలాది జిల్లాలు నక్సలిజం ప్రభావం నుంచి విముక్తి పొందాయని ఆయన తెలిపారు. గతంలో రెడ్ కారిడార్‌గా పిలిచే ప్రాంతాలు ఇప్పుడు గ్రీన్ జోన్‌లుగా మారుతున్నాయని, ఇది దేశ ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని ఆయన అన్నారు. బాంబులు, తుపాకుల ముందు భారత రాజ్యాంగం విజయం సాధిస్తోందని ఆయన ఉద్ఘాటించారు. దేశ భద్రత, సైనిక శక్తి, ఆర్థిక వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయ రంగంలో జరుగుతున్న అభివృద్ధిని గురించి ఆయన మాట్లాడారు. పార్లమెట్ సమావేశాలను పురస్కరించుకుని ఆయన పార్లమెంట్ ముందు మీడియాతో మాట్లాడారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

## ఎన్నికలు ఎప్పుడు జరిగినా విజయం మాదే

## మీడియాతో మాజీమంత్రి హరీష్ రావు



**సిద్దిపేట,జూలై21 (సమయజ్యోతి):**

స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరగినా బిఆర్‌ఎస్‌దే విజయమని అన్నారు. కాంగ్రెస్ 20 నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. స్థానిక ఎన్నికలపై ఈ మధ్య సర్వే చేయిస్తే.. తెలంగాణలో మొత్తం 31 జిల్లా పరిషత్‌లు ఉంటే.. 16 నుంచి 18 స్థానాలని బీఆర్‌ఎస్ కైవసం చేసుకోబోతోందని ఆ సర్వేలో తేలిందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఓడించాలని పిలుపునిచ్చారు. సోమవారం ప్రజ్ఞాపూర్‌లో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.

# లోక్‌సభలో గొంతు నొక్కారు

## మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు ఏక పక్షంగా సమావేశాలు తీరు

## విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపణ




**న్యూఢిల్లీ,జూలై21(సమయజ్యోతి):**

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న తనకు లోక్‌సభ సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో అధికార పక్షం సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

# సమాచార కమిషనర్లలో బిసిలు, ఎస్టీలు ఏరీ: కవిత

హైదరాబాద్,జూలై21(సమయజ్యోతి):

ఇటీవల కాలంలో తెలంగాణ జాగృతి తరపున ఎమ్మెల్సీ కవిత కీలక పోరాటాలు చేస్తూ తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు- సొంతపార్టీ బీఆర్ఎస్ తీరుగా బహిరంగంగా ఎండగడుతున్నారు. తాజాగా ఎక్స్ వేదికగా సమాచార హక్కు చట్టం కమిషన్‌లో కమిషనర్ల నియాకంలో ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూ విమర్శల బాణం ఎక్కుపెట్టారు. సమాచార హక్కు చట్టం కమిషన్‌లో బీసీలు, ఎస్టీలకు చోటు- ఇవ్వరా అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేశారు.

# అత్యాధునికంగా ఖమ్మం మార్కెట్ అభివృద్ధి

## పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం,జూలై21(సమయజ్యోతి):

రాష్ట్రంలో ఖమ్మం మార్కెట్‌ను మోడల్ మార్కెటింగ్ గా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..రూ.150 కోట్లతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులు చేపట్టారు. మార్కెట్ చుట్టూ 6 గేట్లు ఏర్పాటు- చేయాలని తుమ్మల అధికారులకు సూచించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో అన్ని వసతులూ ఏర్పాటు- చేస్తున్నామని, సంక్రాంతి నాటికి మార్కెట్ పనులు పూర్తి చేస్తామని తెలియజేశారు. మార్కెట్ విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి స్థలాలు ఇస్తామని, మార్కెట్ చుట్టూ ఆహ్లాదకరమైన పరిస్థితి ఉండేలా చూస్తామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.



# యూరియా కొరత లేకున్నా కొందరు అసత్య ప్రచారాలు

మొదటిపేజీ తరువాయి

ప్రతీరోజు జిల్లా కలెక్టర్ల కార్యాచరణకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తి నివేదికను అందించాలని సీఎస్ రామకృష్ణారావును ఈ సందర్భంగా సిఎం ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని.. సాగునీటికి సంబంధించి వాటర్ మేనేజ్‌మెంట్ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డిగ అభిప్రాయపడ్డారు. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేయడం ద్వారా దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. యూరియా స్టాక్‌కు సంబంధించి ప్రతీ ఎరువుల దుకాణం వద్ద స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. స్టాక్ డిటైల్స్ ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల కొరత ఉన్నట్లు- కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో కావాల్సినంత యూరియా స్టాక్ ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇతర వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోండంటూ అధికారులను ఆదేశించారు. రైతుల కంటే ఏదీ ముఖ్యం కాదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎరువులకు సంబంధించి ఫిర్యాదులకు ప్రత్యేక డెస్క్ ఏర్పాటు- చేయాలని ఉన్నతాధికారులను ఈ సందర్భంగా సీఎం రేవత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 96 లక్షల 95 వేల 299 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. గతంలో రేషన్ షాపులపై ఆసక్తి ఉండేది కాదని.. సన్న బియ్యంతో రేషన్ కార్డులకు డిమాండ్ పెరిగిందన్నారు. అంతేకాదు రేషన్ కార్డు విలువ, రేషన్ షాపు విలువ పెరిగిందన్నారు. జులై 25 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరపాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇన్‌చార్జి మంత్రులు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్లు కో-ఆర్డినేట్ చేసుకోవాలని.. అలాగే ప్రతీ మండలంలో జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లాల పరిధిలోని ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రోజూ కలెక్టర్లు ఏ పనిచేశారో తనకు తెలియజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వారి కార్యాచరణ రిపోర్టు రోజూ తనకు పంపించాలన్నారు. వర్షాలు, వానాకాలం పంటసాగు, సీజనల్ వ్యాధులు, రేషన్‌కార్డుల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు. రాయితీ ఎరువులను ఇతర అవసరాలకు వాడితే కఠిన చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు వాటర్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలి. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు ఒక్కొక్కరికి రూ.కోటి కేటాయించాలి. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర పక్రియ.. ఆందోళన అవసరం లేదని సీఎం అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు.

# విజయోత్సవ వేళ పార్లమెంట్ సమావేశాలు

మొదటిపేజీ తరువాయి

న్యూఢిల్లీ,జూలై21 (సమయజ్యోతి):

స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి భారతదేశం ఉగ్రవాదం, నక్సలిజం వంటి సమస్యలను ఎదుర్కొంటోందని ప్రధాని మోడీ అన్నారు. నేడు నక్సలిజం, మావోయిజం ప్రభావం వేగంగా తగ్గుతోందని చెప్పారు. దేశ భద్రతా దళాలు ఉత్సాహంతో విజయం వైపు పయనిస్తున్నాయని, వందలాది జిల్లాలు నక్సలిజం ప్రభావం నుంచి విముక్తి పొందాయని ఆయన తెలిపారు. గతంలో రెడ్ కారిడార్‌గా పిలిచే ప్రాంతాలు ఇప్పుడు గ్రీన్ జోన్‌లుగా మారుతున్నాయని, ఇది దేశ ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని ఆయన అన్నారు. బాంబులు, తుపాకుల ముందు భారత రాజ్యాంగం విజయం సాధిస్తోందని ఆయన ఉద్ఘాటించారు. దేశ భద్రత, సైనిక శక్తి, ఆర్థిక వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయ రంగంలో జరుగుతున్న అభివృద్ధిని గురించి ఆయన మాట్లాడారు. పార్లమెట్ సమావేశాలను పురస్కరించుకుని ఆయన పార్లమెంట్ ముందు మీడియాతో మాట్లాడారు. వర్షాకాలం సమావేశాలకు మీ అందరికీ స్వాగతం అని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. ఈ సమావేశం దేశానికి గర్వకారణమైన విజయోత్సవంగా ఆయన అభివర్ణించారు. మోదీ తన ప్రసంగంలో దేశం ఎదుర్కొంటున్న హింసాత్మక ఘటనల గురించి మాట్లాడారు. ప్రధాని మోదీ భారత సైనిక శక్తి గురించి మాట్లాడుతూ, దేశం సైనిక రంగంలో గొప్ప పురోగతి సాధిస్తోందని తెలిపారు. సైనిక రంగంలో పరిశోధన, తయారీ, మేక్ ఇన్ ఇండియా ఆయుధాల ఉత్పత్తి బలపడుతోందన్నారు. ఇది యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం 100 శాతం లక్ష్యాలను సాధించిందని, కేవలం 22 నిమిషాల్లోనే శుత్రువుల ఇళ్లలోకి వెళ్లి వారి స్థావరాలను నాశనం చేసిందని పేర్కొన్నారు. ఈ విజయం దేశానికి గర్వకారణమని మోదీ అన్నారు. సైన్స్, టెక్నాలజీ రంగంలో భారతదేశం సాధిస్తున్న విజయాల గురించి మోదీ మాట్లాడారు. ఈ రంగంలో దేశం కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతోందని, అంతరిక్ష రంగంలో భారత్ కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారత త్రివర్ణ పతాకం ఎగిరిన సందర్భాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ క్షణం దేశ ప్రజలందరికీ గర్వకారణమని, పార్లమెంట్ లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఒకే సమయంలో ఈ విజయాన్ని కొనియాడాయని మోదీ అన్నారు. ఈ విజయాలు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలకు ప్రేరణగా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో వాతావరణం చాలా బాగా అభివృద్ధి చెందుతోందన్నారు. వ్యవసాయ రంగంలో అభివృద్ధిని కూడా ప్రస్తావించారు. ఈ ఏడాది వర్షాకాలం వ్యవసాయానికి అనుకూలంగా ఉందని, నీటి నిల్వలు గత దశాబ్దంతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు- పెరిగాయని తెలిపారు. ఇది రైతుల ఆర్థిక వ్యవస్థ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటు-ందని ఆయన చెప్పారు. ఈ అభివృద్ధి దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ వర్షాకాల సమావేశాన్ని ప్రధాని మోదీ జాతీయ గర్వంతో నిండిన విజయోత్సవ సమావేశంగా అభివర్ణించారు. ఈ వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసి యాత్ర, 'ఆపరేషన్ సిందూర్ ' గురించి ప్రధాని ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్‌లో మన దేశ సైనికుల సత్తా చూశాం. అందులో వందశాతం లక్ష్యాలను సాధించాం. కచ్చితమైన లక్ష్యంతో కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాం. ఈ ఆపరేషన్‌తో మేడిన్ ఇండియా సైనిక సామర్థ్యం, గొప్పతనం ఏంటో ప్రపంచం చూసింది. ఈ మధ్య కాలంలో నేను ఎవరిని కలిసినా మేడిన్ ఇండియా ఆయుధాల గురించే మాట్లాడు తున్నారు. మన ఆయుధాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది దేశ ప్రగతి కోసం అందరూ కలిసి నడవాల్సిన సమయమిది. ఉగ్రవాదం, నక్సలిజాన్ని తుదముట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మోదీ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌పై మన ఎంపీలు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో పర్యటించి వివరించారని ప్రధాని గుర్తు చేశారు. పాక్ దుష్ట చర్యలను అంతర్జాతీయ సమాజం ముందు ఎండగట్టారని అన్నారు. తుపాకులు, బాంబుల ముందు మన రాజ్యాంగం బలంగా నిలబడిందని తెలిపారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ విజయాన్ని వేడుక చేసుకోవాలన్నారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఐక్యత చాలా అవసరమని.. ఎంపీలు, రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశానికి చాలా గర్వకారణంగా నిలవబోతున్నాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మన మువ్వన్నెల జెండా ఎగరడం దేశ ప్రజలందరికీ గర్వకారణం. అంతరిక్ష యాత్రలో ఇదో ప్రేరణ. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుందని మోదీ ప్రశంసించారు. దేశవ్యాప్తంగా వర్షాలు బాగా కురుస్తున్నాయని, ఇది రైతులకు లాభదాయకమని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. రైతుల జీవితాలు, ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధార పడ్డాయని తెలిపారు. ఈసారి పడిన వర్షాలు వ్యవసాయానికి ఊతమిస్తాయి. రైతుల జీవితాలు, ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధారపడి ఉన్నాయి. ఈ వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని కోరుకుంటున్నానని అన్నారు. అంతరిక్షంలో కొత్త చరిత్ర సృష్టించామని.. ఐఎస్ఎస్ లో మువ్వన్నెల జెండా ఎగరడం దేశ ప్రజలకు గర్వకారణం అని అన్నారు. భారత సైనిక పాటవాలను ప్రపంచ దేశాలు ప్రత్యక్షంగా చూసాయి. పహల్గాం ఊచకోతను చూసి ప్రపంచ దేశాలు నివ్వెరపోయాయని, పాక్ నిజస్వరూపాన్ని ఎంపీల బృందం ప్రపంచ దేశాలకు వివరించిందన్నారు. పార్టీలకు అతీతంగా పలు పార్టీలు, పలు రాష్ట్రాల ప్రతినిధులు దేశహితం కోసం పని చేశారు.. వివిధ దేశాల్లో పర్యటించి పాక్ ఉగ్రవాదంపై ఎంపీలు ప్రచారం చేసారని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ది మూడో స్థానమని అన్నారు. 25 కోట్ల మందిని దారిద్య రేఖ నుంచి బయటకు తీసుకొచ్చామని మోడీ వ్యాఖ్యానించారు.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం

## లోక్‌సభలో నినాదాలతో తొలిరోజు వాయిదా

## రాజ్యసభలో నలుగురు కొత్త సభ్యుల ప్రమాణం

న్యూఢిల్లీ,జూలై21(ఆరెన్‌ఎ):

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ, రాజ్యసభ సమావేశమయ్యాయి. తొలుత పహల్గాం ఉగ్రదాడి, ఎయిరిండియా విమాన ప్రమాద మృతులకు ఉభయ సభలు నివాళులర్పించాయి. రాజ్యసభలో కొత్తగా ఎంపికైన నలుగురు ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. అటు- లోక్‌సభలో విపక్షాలు నిరసనకు దిగాయి. ఆపరేషన్ సిందూర్'తో పాటు పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ లోక్‌సభలో విపక్షాలు ఆందోళన చేపట్టాయి. తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చించాలని పట్టుబట్టాయి. అయితే ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి, మీరు చర్చక్రమంలో వస్తే సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని స్పీకర్ ప్రకటించారు. పోడియంలోకి రావడం, నిలబడి నినాదాలు చేయడం తగదని అన్నారు. వారి నినాదాల నడుమ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రతిపక్ష ఎంపీలు నిరసన విరమించాలని సభాపతి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పార్లమెంటు సమావేశాలు జరగడం ఇదే తొలిసారి. ఆగస్టు 21 వరకు 21 రోజుల పాటు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ సహా అనేక అంశాలపై ప్రశ్నల్ని సంధించడానికి విపక్షాలు మూకుమ్మడిగా సిద్ధమయ్యాయి. తాము లేవనెత్తే అంశాలపై ప్రధాని స్పందిం చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, పార్లమెంటు- నియమాలు, సంప్రదాయాలకు అనుగుణంగా 'ఆపరేషన్ సిందూర్' సహా అన్ని అంశాలు చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే స్పష్టం చేశారు.

# బెట్టింగ్ యాప్ కేసు దర్యాప్తు ముమ్మరం

## రానా,విజయ్ దేవరకొండ,ప్రకాశ్ రాజ్, మంచు

## లక్ష్మిలకు నోటీసులు విచారణకు రావాలని ఆదేశించి ఇడి

హైదరాబాద్,జూలై21 (సమయజ్యోతి):

బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ అధికారులు సినీ సెలబ్రిటీలకు షాక్ ఇచ్చారు. ఈ కేసులో ముమ్మరంగా విచారణ చేస్తున్న క్రమంలో బెట్టింగ్ యాప్ కేసులో నిందితులుగా ఉన్న సినీ సెలబ్రెటీలకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే పలువురిని పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని ఈడీ అధికారులు నోటీసులు పంపించారు. జులై 23న దగ్గుబాటి రానా, జులై30న ప్రకాష్‌రాజ్, ఆగస్ట్6న విజయ్ దేవరకొండ, ఆగస్ట్ 13న మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని నోటీసులో తెలిపారు. విదేశీ బెట్టింగ్ యాప్‌లను వీరు ప్రమోట్ చేసినట్లు- ఈడీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో వీరిని మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ చేయనున్నట్లు- తెలుస్తోంది.బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు ఆయా కంపెనీల నుంచి సినీ సెలబ్రెటీలకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై విచారణ చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు. సినీ సెలబ్రెటీలు బెట్టింగ్ యాప్‌లని ప్రమోట్ చేయడంతోనే పలువురు ఆకర్షితులు అయ్యారని ఈడీ అధికారులు, పోలీసులు చెబుతున్నారు. బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి అమాయకులు మోసపోయినట్లు అధికారులకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఈడీ అధికారులు, పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఎంతోమంది బెట్టింగ్ యాప్‌ల బారిన పడి ఆత్మహత్యలు చేసుకోవడంతో ఈడీ అధికారులు, పోలీసులు ఈ కేసుని సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతున్నారు.

# పార్లమెంట్‌లో వ్యూహంపై మోడీ చర్చలు

## మంత్రులతో ప్రధాని సమీక్ష

న్యూఢిల్లీ,జూలై21(సమయజ్యోతి):

పార్లమెంటు- సమావేశాల్లో తొలిరోజు గందరగోళ పరిస్థితి నెలకొంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సింధూర్, అహ్మదాబాద్ విమాన ప్రమాదాలపై మోడీ స్పందించాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టడంతో గందరగోళం నెలకొంది. ఈ సమయంలోనే ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన పార్లమెంట్ హౌస్‌లో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయ మంత్రి అర్జున్ మేఘ్వాల్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోపాటు- పలువురు మంత్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో సభ అజెండాలు, ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపైన ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. పలు కీలకమైన బిల్లును ఆమోదింపజేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపైన చర్చించినట్లు తెలుస్తున్నది. అయితే ఈ సమావేశ అజెండాపై ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

# కంజర రెసిడెన్షియల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్**

మోపాల్ మండలం కంజర గ్రామంలో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ స్కూల్/కళాశాలను కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాలను తిరుగుతూ, నిశితంగా పరిశీలించారు. కిచెన్, డార్మెటరీ, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్ లలో వసతులను పరిశీలన జరిపారు. విద్యార్థినుల కోసం సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. స్టోర్ రూంలో నిల్వ ఉన్న బియ్యం, పప్పు దినుసులు, వంట నూనె ఇత్యాది సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులు, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. అల్పాహారం, భోజనం రుచికరంగా ఉంటోందా? అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయా, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాల తరగతి గదులు, పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిర్వహణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.



# కాల్పోల్ తండాను సందర్శించిన కలెక్టర్

## వైద్య శిబిరం ఆకస్మిక తనిఖీ

## పరిస్థితి అదుపు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

మోపాల్ మండలంలోని కాల్పోల్ తండాను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం సందర్శించారు. తండాలో పలువురికి జ్వరాలు సోకిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్వర పీడితుల వివరాలను, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి అధికారులను వివరాలు తెలుసుకున్నారు. జ్వరాలు ప్రబలేందుకు గల కారణాలను గుర్తిస్తూ, పరిస్థితి అదుపు తప్పకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జ్వరాలు, ఇతర అనారోగ్య కారణాలతో అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్సలు అందించాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే స్థానికులు వైద్య శిబిరాన్ని సందర్శించి తగిన చికిత్సలు పొందేలా చూడాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని స్థానిక అధికారులను ఆదేశించారు. నివాస ప్రాంతాల నడుమ నీరు నిలువ ఉండకుండా చూడాలని, పారిశుధ్య సమస్య నెలకొనకుండా శానిటేషన్ పనులు జరిపించాలన్నారు. మురికి కాల్వలు, నీరు నిలువ ఉన్న ప్రదేశాలలో దోమల నివారణ మందులు



పిచికారీ చేయించాలని, ప్రతి ఇంటిని సందర్శించి పరిస్థితిని సమీక్షించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా తండాలోని ఆయా నివాస ప్రాంతాలను సందర్శిస్తూ, స్థానికంగా నెలకొని ఉన్న పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నివాస ప్రాంతాల నడుమ నిరుపయోగంగా ఉన్న టైర్లు, ఇతర వస్తువులను గమనించిన కలెక్టర్, వాటిని నివాస ప్రదేశాలకు దూరంగా పారవేయాలని స్థానికులకు హితవు పలికారు. లేనిపక్షంలో దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు, సీజనల్ వ్యాధులు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. మరో వారం రోజుల పాటు తండాలో వైద్య శిబిరం ఉంటుందని, జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే శిబిరాన్ని సందర్శించి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. పరిస్థితి అదుపులోనే ఉందని, ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని తండా వాసులకు కలెక్టర్ భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ తుకారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మోపాల్ ఎంపీడీఓ రాములు, ఎంపీఓ కిరణ్ తదితరులు ఉన్నారు.

# సిఎంను కలిసిన కాంగ్రెస్ ఇంచార్జీ సునీల్ కుమార్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

హైదరాబాదులో ఆదివారము సిఎం రేవంత్ రెడ్డిని, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను, పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరగా, సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.



# ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు మహమ్మద్ షబ్బీర్ అలీ జన్మదిన శుభాకాంక్షలు

**సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్ బ్యూరో**

ఏఐసిసి అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదినం సందర్భంగా ఆయనకు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్ర పరిపాలనా విలువలకు మల్లికార్జున్ ఖర్గే అపారమైన కట్టుబాటును ప్రశంసించారు. “ఖర్గే కాంగ్రెస్ పార్టీ యొక్క ప్రముఖ నాయకుడే కాక, భారతీయ రాజకీయాల్లో సంకల్పం, అంకిత భావానికి ప్రతీక. ఆయన రాజకీయ ప్రస్థానం పార్టీ నాయకులకు కార్యకర్తలతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మల్లికార్జున్ ఖర్గే తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో వంచితులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పాటుపడ్డ ముఖ్య నాయకుడని, “అతను మౌనంగా ఉన్నవారి పక్షాన బలమైన కవచం మరియు పార్టీకి కష్టకాలాల్లో మార్గదర్శక శక్తి. అతని నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ సిద్ధాంతాలను అంకితం భావంగా నిలబెడుతోంది,” అని గౌరవంగా పేర్కొన్నారు. ఆయురారోగ్యాలతో ఉండాలని, పార్టీతో పాటు దేశాన్ని పురోగమనం, సమగ్రాభివృద్ధి వైపు నడిపించే శక్తిగా ఉండాలని ఆకాంక్షించారు.



# రాష్ట్ర స్థాయి కామిక్ రైటింగ్ పోటీలకు ములుగు పల్లె విద్యార్థిని ఎంపిక

**సమయజ్యోతి ప్రతినిధి భూపాల్ పల్లి**

ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎన్సిఈ ఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కామిక్ రైటింగ్ పోటీలలో మహా ముత్తారం మండలం ములుగు పల్లి పదవ తరగతి విద్యార్థిని బొల్లి శివ గ్రీష్మ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనారు సెల్ఫోన్ అనర్థాల వల్ల కలిగే నష్టాలు జనాభా పెరుగుదల వల్ల జరిగే నష్టాల గురించి కామిక్ రూపంలో చిత్రం అద్భుతంగా గీసినందుకు గాను జిల్లా స్థాయి అధికారులు శివగ్రీష్మ ను ఎంపిక చేశారు జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శివ గ్రీష్మ ద్వితీయ స్థానంలో నిలవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి రాజేంద్రప్రసాద్ ఉపాధ్యాయులు అనిల్ నాయక్ సకరం నాయక్ కామిడి సతీష్ రెడ్డి ఎస్ చంద్రకళ పెనుకుల యాదగిరి జి సుధాకర్ రెడ్డి పిఈటి పి వెంకటేష్ ఆర్టు టీచర్ బోనాల వెంకటేష్ సిఆర్పి బాపిరెడ్డిలు అభినందించారు అదేవిధంగా శివ గ్రీష్మ మరెన్నోబహుమతులు అందుకొని రాష్ట్ర స్థాయిలో వన్నె తేవాలని మండల విద్యాధికారి మందల రవీందర్ రెడ్డి మాజీ మండల విద్యాధికారి పాశం సంజీవ రెడ్డి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తాళ్లపల్లి రజిత హర్షం వ్యక్తం చేసారు



# ఆర్మీ శిక్షణలో..వర్ధమన్నూర్ యువ జవాన్ మృతి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్**



ఆర్మీ శిక్షణా పొందుతున్న ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలం వర్ధమన్నూర్ గ్రామం యువ జవాన్ నలువల ఆకాష్ ఆకస్మిక మృతి చెందాడు. మరో 15 రోజుల్లో శిక్షణ ముగియనుండగా ఈ సమాచారం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచింది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.ఆకాష్ ఆరు నెలల క్రితం అస్సాం రైఫిల్స్ లో జవాన్‌గా ఎంపికయి, శిక్షణలో భాగంగా జరిగిన 20 కిలోమీటర్ల పరుగులో పాల్గొన్న సమయంలో ఆకస్మికంగా కుప్పకూలిపోయాడు. అధికారులు వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ, ప్రాణాలు కాపాడలేకపోయారు. డిహైడ్రేషన్ కారణంగానే ఆకాష్ మృతి చెందినట్లు అధికారుల సమాచారం. ఆకాష్ శిక్షణ పూర్తి చేసుకుని పరేడ్ సెల్యూట్ కార్యక్రమం కోసం పిలిచే రోజు కోసం ఎదురుచూస్తున్న కుటుంబానికి ఈ వార్త పిడుగు పాటుగా మారింది. ఇప్పుడు అతడి భౌతిక కాయం స్వగ్రామం తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందరితో కలివిడిగా ఉండే ఆకాష్ మృతితో అతడి స్నేహితుల తో పాటు మండలం తీవ్ర విషాదానికి లోనైంది. బజార్హత్నూర్ మండలమంతా విషాదంలో మునిగిపోయింది. గ్రామస్తులు, బాధిత కుటుంబానికి సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతి పథకానికి రేషన్ కార్డు కీలకం : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రతి పథకం అమలులో రేషన్ కార్డులు అత్యంత కీలకమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి రైతు వేదికలో వీర్నపల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను కలెక్టర్, ప్రజాప్రతినిధులు సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని అర్హులైన 329 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని వెల్లడించారు. అలాగే ఇప్పటికే ఉన్న కార్డుల్లో మొత్తం 975 మందిని అదనంగా చేర్చామని వెల్లడించారు. రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ అని, ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంకా కార్డు రాని వారు ఉంటే సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు.కార్యక్రమంలో కే కే మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, డీఎం సివిల్ సప్లై రజిత, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ పరామర్శ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

కమ్మర్ పల్లి మండలం పలు గ్రామాల్లో సోమవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. హాసకొత్తూర్ గ్రామానికి చెందిన వడ్డెర శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, పదివేల ఆర్థిక సాయం అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన జుంబరాత్ అన్వేష్, ఓమన్ లో దురదృష్టవశాత్తూ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం పరంగా ఐదు లక్షల సహాయాన్ని అందించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఉప్లూర్ గ్రామానికి చెందిన అజయ్ అమ్మ రాజవ్వ మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఇదే గ్రామంలో పితృవియోగం పొందిన మాజీ సర్పంచ్ బద్దం రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహిళా ఫిర్యాది సమస్యపై స్పందించిన సిపి సాయి చైతన్య

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసిన భార్య భామని సవిత, అంశంపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పందించి, టూ టౌన్ పోలీస్ స్టేషన్ హౌస్ అధికారులకు, ఆమె సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం

## సంపాదకీయం

# విపక్షంగా విఫలం అవుతోన్న కాంగ్రెస్ !

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. యథావిధిగానే వాయిదాలతో సమావేశాలు స్వాగతం పలికాయి. ప్రతి సమావేశంలోనూ ఇలాగే జరుగుతోంది. పార్లమెంట్ ప్రజల కోసం ఉద్దేశించిందిన్న ఇంగితం అధికార, విపక్షాలకు ఉండడం లేదు. మొక్కుబడిగా సమావేశాలకు హాజరు కావడం, బత్తా పుచ్చుకోవడం, ప్రజల నెత్తిన పన్నులు రుద్దడం అన్న తంతు కొన్నేళ్లుగా సాగుతోంది. నిజంగానే మనం ప్రజలకు న్యాయం చేస్తున్నామా అన్న ఆలోచన ఏ నాయకుడూ చేయడంలేదు. తొలిరోజే వాయిదా తీర్మానాలు ఇవ్వడం, గొడవ చేయడం వంటి చర్యలు ఈ సమావేశాల్లోనూ కనిపించాయి. దీంతో వాయిదాతో స్పీకర్ ఓం బిర్లా సమావేశాలకు శ్రీకారం చుట్టారు. గొడవ చేస్తేనే ప్రతిపక్షం అన్న రూఢి నాటుకుపోయింది. ఓ రకంగా చెప్పాలంటే ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఎప్పుడూ విఫలం అవుతూనే ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించేందుకు కొన్ని పద్దతులు ,రూల్స్ ఉన్నాయి. ఏ సమస్యనైనా చర్చించి, జవాబు రాబట్టడం ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. కానీ కాంగ్రెస్ అలా చేయడం లేదు. ఇండియా కూటమిగా జట్టు కట్టినా పార్లమెంట్ అంటే అధికార బిజెపికి భయం లేకుండా పోతోంది. ఎందు కంటే బలహీనమైన ప్రతిపక్షం, పేలవమైన తీరు కారణంఅని చెప్పవచ్చు. పార్లమెంట్ సమావేశాలు ఆగస్ట్ 21 వరకు అంటే దాదాపు నెలరోజుల పాటు కొనసాగనున్నాయి. ఆగస్టు12 నుంచి 18 వరకు సమావేశాలకు సెలవులు ఉంటాయి. ఈ సమావేశాల్లో మొత్తం 7 పెండింగ్ బిల్లులతో పాటు మరో 8 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. ఇక, దేశ భద్రతకు సంబంధించిన పలు కీలక విషయాలను పార్లమెంటులో చర్చించాలని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ వంటి వాటిపై చర్చించాలని ఇండియా కూటమి పట్టుపట్టాలని కోరుకుంటోంది. తానే యుద్ధం ఆపించానని ట్రంప్ పదేపదే చెప్పడం, దేశ ఆంతరంగిక విషయాలలో ప్రమేయం అయిందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. ట్రంప్ వ్యాఖ్యలపై మోడీ పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, ఇంతకు అమెరికా పట్ల ఎటువంటి వైఖరి ఉందనేది తెలియచేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయనున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలు వాడీ వేడీగా జరగ నున్నాయి. అయితే, ఆపరేషన్ సింధూర్‌పై చర్చించేందుకు సిద్ధమేనని ఇప్పటికే కేంద్రం స్పష్టం చేసింది. నిజానికి ఈ సమస్యలను ఏదో ఒకరూపంలో చర్చించి, సమాధానాలు రాబట్టవచ్చు. ప్రశ్నోత్తరాల సమయంలో వాటిని కొనసాగించడం ద్వారాను సమస్యలకు పరిష్కారం కనుగొనవచ్చు. కానీ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అలా చేయడం లేదు. కేవలం రచ్చచేయడం ద్వారా వార్తల్లోకి ఎక్కాలని చూస్తోంది. ప్రజలు ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా ఎజెండాను రూపొందించుకోవడంలో కాంగ్రెస్ ప్రతిసారీ విఫలం అవుతోంది. పార్లెంట్ లోపలా,బయటా విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోంది. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ వెనుకబడుతున్నారు. దీనికి కారణం స్పష్టమైన విధానాలు. నాయకత్వ లోపాలే కారణంగా చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు అనగానే ప్రజలు ఏమి కోరుకుంటున్నారన్న ఆలోచనలు చేయాలి. పార్లమెంటులో ఎలా చర్చిస్తే ప్రభుత్వాన్ని నిలదీయవచ్చన్న వ్యూహం ఉండాలి. ఇలాంటి వ్యూహాలు లేకపోవడం వల్లనే కాంగ్రెస్ కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమవుతోంది. అలాగే యువతరానికి పూర్తిగా దూరమయ్యారు. సమస్యలు ఎదురైనప్పుడు సత్తా చాటాలి. అందుకు పార్లమెంట్ మంచి వేదిక. ముందుతరం కాంగ్రెస్ నాయకత్వం అనుసరించిన విధానాలు ఏమిటి? ఇప్పుడు ఆ పార్టీ యువ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? అని ప్రశ్నించుకుంటే జవాబు లభించగలదు. ప్రధానంగా ఓ 20 రోజుల పాటు జరిగే పార్లమెంటులో ఏయే అంశాలు చర్చించాలి, ఎలా చర్చించాలి అనే ప్రణాళిక ఉండాలి. కానీ అలా జరగడంలేదు. రాహుల్‌కు నాయకత్వ లక్షణాలు ఎలాగూ లేవు. కనీసం ఇతర సీనియర్ నేతలతో చర్చించి, పార్లమెంట్ వ్యూహం అనుసరించాలి. అదీ చేయడం లేదు. ఈ కారణంగా మెజారిటీ ప్రజలు క్రమంగా ఆ పార్టీకి దూరమవుతూ వచ్చారు. నెహ్రూ,ఇందిరాగాంధీ అనుసరించిన విధానాలను కూడా రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను, పోకడలను ఆకళింపు చేసుకొని అందుకు అనుగుణంగా పార్టీకి దిశానిర్దేశం చేయడంలో రాహుల్‌గాంధీ విఫలం అవుతున్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణం గా వ్యూహ రచన చేస్తూ పార్లమెంటులో తన వాగ్ధాటిని వినిపిస్తున్నారు. సమస్య ఏదైనా సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. అలాంటప్పుడు సమస్యను ఎలా, ఎప్పుడు చర్చించాలన్న వివేచన చేసుకోవాలి. అదేపనిగా వాయిదా తీర్మానాలు ఇవ్వడం, వాటిని స్పీకర్ తిరస్కరించడం షరామామూలుగా జరిగే ప్రక్రియ. అలాకాకుండా సమస్యలను గుర్తించి, వాటిపై అధ్యయనం చేసి, నోటీసులు ఇచ్చి చర్చకు పట్టుబట్టాలి. అలా చేయడంలో కాంగ్రెస్, దానిని అనుసరిస్తున్న ఇతర పార్టీలుకూడా విఫలం అవుతున్నాయి. తక్షణ చర్చ అన్నది దేశంలో కొంపలు అంటుకుంటే తప్ప జరగదు. ఈ మాత్రం కూడా తెలియని వారు మన నేతులగా ఉండడం దేశం చేసుకున్న దౌర్భాగ్యం. పార్లమెంట్ సమయాన్ని వృధా చేయకుండా సమస్యలను చర్చించేలా చేస్తు తప్ప ప్రజలు నమ్మరు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? ఎన్నికల్లో ఆయన విజయాలు అందుకోవడానికి కారణం ఏమిటి? అని అధ్యయనం చేయకుండా కాలం చెల్లిన నినాదాలను అందిపుచ్చుకోవడం అవివేకం అవుతుంది. అందుకే భారతీయ జనతా పార్టీ మెజారిటీ ప్రజలకు చేరువ అవుతుండగా, కాంగ్రెస్ పార్టీ దూరమవుతోంది. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా, యువతరం మనోభావాలతో పొంతన లేకుండా రాహుల్‌గాంధీ ఆలోచనలు ఉండటం కాంగ్రెస్ పార్టీకి శాపంగా పరిణమిస్తోంది. అలాగే పార్లమెంట్ సమావేశాల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోతోంది. ప్రజల సమస్యలపై చర్చకు అవకాశం లేకుండా పోతోంది. దీనికి ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌దే బాధ్యత అని చెప్పక తప్పదు.

# పీడిత ప్రజల గొంతుక దాశరథి కృష్ణమాచార్య

సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక



తెలంగాణ ప్రజల కన్నీళ్లని అగ్ని ధారగా మలచి నిజాం పాలన మీదికి ఎక్కు పెట్టిన మహా కవి దాశరథి పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకుని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి కృష్ణమాచార్య చిరస్మరణీయుడు నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించిన ఉద్యమ సేనాని

ఓ నిజాం పిశాచమా కానరాడు
నిన్ను బోలిన రాజు మాకెన్నడేనని
తీగలను తెంపి అగ్నిలో దింపినావు
నిజాం రాజు తరతరాల బూజు అని గొంతెత్తిన కవి

దాశరథి గా పేరు గాంచిన దాశరథి కృష్ణమాచార్యలు జూలై 22, 1925 న మహబూబాద్ జిల్లా చిన్న గూడూర్ లో జన్మించారు నిజాం ప్రభువును ఎదిరిస్తూ రచనలు చేశాడు. తెలంగాణ విముక్తి కోసం కృషి చేశాడు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి. పలు సినిమాలకు గేయరచయితగా పనిచేశాడు. ప్రతి సంవత్సరం దాశరథి జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో సాహిత్యరంగంలో కృషిచేసినవారికి తెలంగాణ ప్రభుత్వం దాశరథి సాహితీ పురస్కారం అందజేస్తోంది వీరి తల్లిదండ్రులు దాశరథి వెంకటాచార్య వెంకటమ్మ బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బి.ఎ చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిహైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్‌స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు.

నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు.

“ రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు.

దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్ ”అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు.

ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది, నిజాము ప్రభుత్వం. ఆయనతోపాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. పళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిన్నాడు. మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగస్టు 15 నుండి 1983 వరకు పనిచేశాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. 1987 నవంబరు 5వ తేదీన కన్నుమూశాడు దాశరథి.వీరు ఎన్నో రచనలు, చేసి పలు అవార్డులు, బిరుదులు అందుకున్నారు వీరు జన్మించిన మహబూబాద్ జిల్లాకు దాశరది జిల్లా గా పేరు పెట్టాలి వీరిని ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి వారి రచనలు అధ్యయనం చేయాలి

కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా
జూలై 22 న ప్రసిద్ధ కవి దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా
9848445134

# జనకవి జయరాజ్‌కు 'మా భూమి - దాశరథి ప్రజా సాహిత్య పురస్కారం' ప్రదానం

## దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా ఘనంగా నివాళి



సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్, జూలై 21:

నిజాం అరాచక పాలనపై తన శబ్దాలతో ఉద్యమరాగాలు ఆలపించిన విప్లవ కవి దాశరథి కృష్ణమాచార్య గారి శతజయంతిని పురస్కరించుకుని, మా భూమి సాహిత్య వేదిక ఆదివారం రాత్రి సాగర్ రింగ్ రోడ్డులోని శ్రీ వాసవి శ్రీ నిలయం లో ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రముఖ ప్రజాకవి జయరాజ్ కు 'మా భూమి – దాశరథి ప్రజా సాహిత్య పురస్కారం' ను ప్రదానం చేసి, సామాజికంగా చైతన్యవంతమైన సాహిత్యంలో ఆయన చేసిన కృషికి గౌరవం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు, సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్, హైదరాబాద్ అదనపు న్యాయమూర్తి కె. మురళీమోహన్, మరియు దాశరథి కుమారుడు లక్ష్మణ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మా భూమి సమన్వయకర్త గొర్రెపాటి నరసింహప్రసాద్ మాట్లాడుతూ, దాశరథి వంటి సాహితీ విప్లవకారులను స్మరించుకోవడం సమాజ చైతన్యానికి ఎంతో అవసరమని అన్నారు. నిజాం పాలనలో ప్రజలను తన పదాలతో మేల్కొలిపిన దాశరథి గారి ధైర్యవంతమైన రచనలను వక్తలు కొనియాడారు. పురస్కారం అందుకుంటూ జయరాజ్ మాట్లాడుతూ, “ఎంతెంత నిర్ఘాతం దాచిన శబ్దరహిత సముద్రంఎప్పటిదో అనాథలు, ఆర్తులు లేని నవయుగంఎన్నెన్నో గాయాల నిండిన కవుల గుండెల్లో రాయబడని కావ్యాలు”అని కవితలతో ప్రజల మనసులను తాకారు. దాశరథి గారికి అర్పణగా తాను రచించిన పాట “శిలా నీవే, శిల్పం నీవే” ను ప్రస్తావించారు. సమాజ అభివృద్ధికి ప్రశ్నించే మనసే దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ మానవత్వం, పర్యావరణ పరిరక్షణ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సాంస్కృతిక కార్యక్రమంలో కవిత, సరస్వతి చంద్రకళ, ముస్కు పవన్ రెడ్డి, జ్యోతిర్మయి, శరణ్య, తేజస్విని, రాధ, యుగంధర్ రెడ్డి తదితర కళాకారులు దాశరథి మరియు జయరాజ్ రచించిన పాటలను ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మా భూమి సభ్యులు యానాల నాగిరెడ్డి, జూపూడి ఉదయ్ శంకర్, ఇంజమూరి రఘునందన్, అలివెలుమంగ, కొసరాజు శరణ్య, కేశవరావు, ఎన్‌ఎస్‌ఆర్ మూర్తి శంకర్ లు తమ మద్దతును అందించారు.

# కేకే మహేందర్ రెడ్డి కి సన్మానం.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం బిసిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి బండారు మల్లేశం, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటకాల సుధాకర్, డిటిఎఫ్ మండల అధ్యక్షులు అంజాగౌడ్, కె.శేఖర్, జాతీయ బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి ఈడుగురాళ్ల సురేష్ గౌడ్, కాంగ్రెస్ శ్రేణులు ఎల్ల బాల్రెడ్డి, తలారి నర్సింలు, కదిరే సత్య గౌడ్ పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ ఇంచార్జి పరామర్శ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

ఏర్గట్ల మండల కేంద్రంలో సోమవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మాజీ సొసైటీ చైర్మన్ బద్దం లింగారెడ్డి గుండెపోటుతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. పితృవియోగం పొందిన శ్రీను, సాయన్న లను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

## : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

అర్హులైన పేదలందరికీ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదికలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అర్హులైన 2610 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని వెల్లడించారు. అలాగే ఇప్పటికే ఉన్న కార్డుల్లో మొత్తం 4527 మందిని అదనంగా చేర్చామని వెల్లడించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మొత్తం 21 వేల రేషన్ కార్డుల లబ్ధిదారులకు బియ్యం పంపిణీ అవుతున్నాయని తెలిపారు.

**అన్నిటికి కీలకం**

రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ అని, ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, గుర్తింపు కోసం కూడా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. జిల్లాలో నూతనంగా 14 వేల లబ్దిదారులకు రేషన్ అందించేందుకు కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణీ జరుగుతుందని వివరించారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఇంకా కార్డు రాని వారు ఉంటే సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఎం సివిల్ సప్లై రజిత, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పటాన్చెరు లో ఘనంగా బోనాల పండుగ

## బోనమెత్తిన ఎమ్మెల్యే దంపతులు

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

పటాన్చెరులో ఆషాడమాసం బోనాల సంబురాలు అంబరాన్నంటాయి పట్టణంలోని ప్రతి అమ్మవారి ఆలయం భక్తులతో కిటికీటలాడింది పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మహంకాళి అమ్మవారి దేవాలయం నుండి భారీ ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు వందలాది మంది కళాకారులు పోతురాజులు శివసత్తుల పూనకాలతో ప్రజలందరూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారుఎమ్మెల్యే జిఎంఆర్ కొద్దిసేపు నృత్యం చేసి అందరిని ఉత్సాహపరిచారుఆషాడ మాస బోనాల పండుగ సందర్భంగా పటాన్చెరువు పట్టణంలోని వివిధ కాలనీలో గల అమ్మవారి దేవాలయాలను ఎమ్మెల్యే జిఎంఆర్ దర్శించుకున్నారు బోనాల పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి యాదమ్మ వారి కుటుంబ సభ్యులు ఏడుగుళ్ళ పోచమ్మ దేవాలయంలో బోనం సమర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ గూడెం మధుసూదన్ రెడ్డి గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి సిఐ వినాయక్ రెడ్డి గూడెం విక్రమ్ రెడ్డి గూడెం సంతోష్ రెడ్డి గూడెం సందీప్ రెడ్డి మాజీ ప్రజాప్రతినిధులు జిఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు



# గోవాలో జరిగే ఓబిసి జాతీయ మహాసభను జయప్రదం చేయండి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

గోవాలోని శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడి యంలో ఆగస్టు 7వ తేదీన 10వ జాతీయ ఓబిసి మహాసభను విజయవంతం చేయాలని బిసి సంక్షేమ సంఘం నాయకులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వాల్ పోస్టర్లు విడుదల చేసారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిల్ల శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షుడు ముడారపు శేఖర్ లు మాట్లాడుతూ మేమెంతో, మాకంత అనే నినాదంతో ముందడుగు వేస్తూ రాజకీయ అధికారాన్ని సాధించి బీసీల ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పాలని పిలుపునిస్తు ముందుకు సాగుతున్న బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అని అన్నారు. ఓబీసీ లు అందరూ కలసి అధిక సంఖ్యలో గోవా తరలివచ్చి 10వ ఓబిసి మహాసభను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ నాయకులు తడిగొప్పుల రవిరాజా, జాడ క్రాంతి కుమార్, చెప్పాల రమేష్, ఎండీ కలీమ్, యోగానంద రావు, సంపత్, కలీల్, ఎర్రన్న, యాదగిరి, రమేష్, యూత్ నాయకులు గరిగె సుమన్, ముష్కే అఖిల్, శ్రావణ్, అర్కటి రవీందర్, అనిల్, ఒమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన సంబరాలు

## కేక్ కట్ చేసిన మండల

## యువజన కాంగ్రెస్ నాయకులు

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా**

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పుట్టినరోజు వేడుకలను సోమవారం కృష్ణ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదినం సందర్భంగా కృష్ణ మండల కేంద్రంలోని పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యువజన మండల అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీకి చిరస్మరణియమైన సేవలు అందిస్తున్నారని కొని ఆడారు. ఆయన సేవలు పార్టీకి ఎంతో అవసరమని అన్నారు. నిండు నూరేళ్లు జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యువజన నాయకుడు షేక్ సరఫరాజ్ నాయకులు పల్లె సురేష్ సంతోష్ పాటిల్, సోలాపూర్ నాగేష్,అసిఫ్, తిమన్న, సుదర్శన్, అమ్రేష్ గౌడ,సుగురేష్, తిమ్మప్ప, రమేష్, ఇమ్రాన్ తయ్యబ్ అజ్మీర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలందరికి బోనాల పండగ శుభాకాంక్షలు ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రజలందరికి బోనాలపండగ శుభాకాంక్షలు తెలిపారు పటాన్చేరు నియోజకవర్గం రామచంద్రాపురం పట్టణంలోని కట్ట పోచమ్మ దేవాలయం తుల్జా భవాని మాత దేవాలయం నాగులమ్మ దేవాలయంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి తో కలిసి బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బోనాల పండుగకు ప్రత్యేక విశిష్టత ఉందని అన్నారు భారత దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా కేవలం తెలంగాణలో మాత్రమే కనిపించే సంస్కృతి ఈ బోనాల పండుగ అని అన్నారు గ్రామ దేవతకు బోణం సమర్పించి ప్రజలు సుభిక్షంగా ఉండాలని సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండాలని అమ్మవారిని ప్రజలందరూ వేడుకుంటారనిఅందరి సంక్షేమాన్ని కోరుకునే సంస్కృతి తెలంగాణ ప్రజలదని తెలియజేశారు రామచంద్రపురం పట్టణ మరియు పటాన్చేరు నియోజకవర్గ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చిగురు శ్రీనివాస్ గ్రామ పెద్దలు కుమార్ గౌడ్ మురళీధర్ రెడ్డి జానీ వెంకట్ రెడ్డి నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ

**అమలాపురం,జూలై21(సమయజ్యోతి):**

ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం పరిధిలోని చెయ్యేరు గున్నేపల్లిలో కొలువైన గ్రామ దేవత సత్తమ్మ తల్లిని రూ. 27 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. రూ.500, రూ.200, రూ.50, రూ.20, రూ.10ల నోట్లను దండలుగా గుచ్చి అంతరాలయం లోపల, అమ్మవారు, పోతురాజు విగ్రహాలను ముస్తాబుచేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# సూర్యాపేట బంగారం షాపులో భారీ చోరీ

**సూర్యాపేట,జూలై21(సమయజ్యోతి):**

సూర్యాపేటలోని సాయి సంతోషి నగల దుకాణంలో భారీ చోరీ చోటుచేసుకుంది. భారీగా నగలు,నగదు దోచుకున్నారు. 18 కిలోల బంగారం, రూ.22 లక్షల నగదు చోరీ జరిగిందని యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుకాణం వెనుక నుంచి గ్యాస్ కట్టర్‌తో షట్టర్ తొలగించి దొంగలు లోనికి ప్రవేశించినట్లు- చెప్పారు. ఘటనాస్థలికి చేరుకుని పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. చోరీ జరిగిన దుకాణాన్ని ఎస్పీ నరసింహ పరిశీలించారు. మొత్తం 5 బృందాలను ఏర్పాటు- చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు- తెలిపారు. షాప్ యజమాని కిశోర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు- వెల్లడించారు. చోరీ జరిగిన బంగారం వివరాలు సేకరిస్తున్నట్లు- చెప్పారు. దొంగలు రెక్కీ నిర్వహించి ఈ చోరీకి పాల్పడినట్లు- తెలుస్తోందని ఎస్పీ పేర్కొన్నారు.

# తహసీల్ భవన నిర్మాణ పనులూ కలెక్టర్ పరిశీలన.. కుట్టు మిషన్లు పంపిణీ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలకేంద్రంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి తో కలిసి, తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం మట్ట రాజేశ్వర్ రెడ్డి ఆద్వర్యంలో ముస్తాబాద్ రైతు వేదికలో దాదాపు 28 కుట్టు మిషన్లు మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. మహిళలు కుట్టు మిషన్లు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఏఎంసీ చైర్ పర్సన్ తలారి రాణి, తహసిల్దార్ సురేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాలరెడ్డి పాల్గొన్నారు.నిర్మాణంలోని తహసిల్ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్ మండలకేంద్రంలో తహసిల్దార్ కార్యాలయ భవనం పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం పరిశీలించారు. మండలకేంద్రంలో కొనసాగుతున్న తహసిల్దార్ కార్యాలయ భవనం పనులను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.






# ఎంపీ నిధులతో బోరుబావి ఏర్పాటు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలము పోతుగల్ ఎల్లమ్మ దేవాలయం వద్ద త్రాగునీటి సౌకర్యం కోసం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంపీ ల్యాడ్స్ తో మండల బిజెపి అధ్యక్షులు సొల్లా క్రాంతి కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేరుగు అంజా గౌడ్ ఆధ్వర్యంలో బోరు బావి ఏర్పాటు చేయించారు. దీనికి సహకరించిన మంత్రి బండి సంజయ్ కుమార్ కు, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపికి కృతజ్ఞతలు తెలిపారు.

# బాధితుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

బాధితుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి,తమ పరిధిలో ఉండే ప్రతి ఒక్క సమస్య పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు..సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల రోజును నిర్వహించిన జిల్లా ఎస్పీ,దాదాపు జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారుల సమస్యలను విని వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా సమస్యల ను పరిష్కరించాలని ఆదేశాలను జారీ చేశారు.పోలీసు ముఖ్య కార్యాలయంలో దాదాపు 26 ఫిర్యాదులు రాగా ఓపికగా సమస్యలను విన్న జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.ముఖ్యంగా జిల్లా ఎస్పీ వద్దకు వచ్చే ఫిర్యాదులలో భూ సమస్యలలో కుటుంబ సభ్యుల మోసం,నకిలీ రిజిస్ట్రేషన్లు,డబల్ రిజిస్ట్రేషన్ లతో మోసం చేసే వ్యక్తుల పై ఫిర్యాదులు అందాయని వాటిపై సరైన ఆధారాలతో కేసులను నమోదు చేయాలని తెలిపారు.తదుపరి జిల్లాలో వివిధ కారణాలతో పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న కేసులపై,భార్యాభర్తల సమస్యలపై,కుటుంబ కలహాలు,తండ్రి కొడుకుల సమస్యల ఫిర్యాదులు,వడ్డీ వ్యాపారుల సమస్యలు,భూ సమస్యలు వాటి పరిష్కారానికి జిల్లా ఎస్పీకి ప్రజలు సంప్రదించడం జరిగింది.ప్రతి సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల రోజున నిర్వహించడం జరుగుతుందని ప్రజలు సమస్యలపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో లేదా నేరుగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు సమర్పించవచ్చని తెలిపారు.సుదూర ప్రాంతాల వారు జిల్లా ఎస్పీకి వాట్సప్ ద్వారా సమాచారం అందించాలంటే లేదా ఫిర్యాదు చేయాలంటే 8712659973 నెంబర్ కు సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిసి కొండరాజు,ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత,సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.



# బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మక్తల్ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

## జిల్లా అధ్యక్షుడు బొదిగెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా**

నారాయణ పేట జిల్లా మక్తల్ నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ తెలిపారు.సోమవారం మక్తల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులు,మరియు పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ప్రకటించారు.మక్తల్ నియోజకవర్గ ఇంచార్జీ గా పాలెం వెంకటయ్య, నియోజకవర్గ అధ్యక్షుడిగా కెవి నరసింహ, ఉపాధ్యక్షునిగా పరుశురాం,ప్రధాన కార్యదర్శి గా మల్ రెడ్డి,కార్యదర్శిగా కర్కు బస్వరాజ్,కోశాధికారిగా మల్లికార్జున్ లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూనియోజకవర్గంలో పార్టీ బలోపేతం,ప్రజా,సమస్యలు బహుజన వర్గాలను ఏకం చేసి బహుజనుల కు రాజ్యాధికారం కోసం పని చేయాలని నూతన కమిటీకి దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ జుట్ల నరేందర్,జిల్లా కార్యదర్శి బండారి చంద్ర శేఖర్, బీఎస్పీ నాయకులు అజయ్ కుమార్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారము మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాల్రెడ్డి, ఎఎంసి చైర్మన్ తలారి రాణి నర్సింలు చేతుల మీదుగా 68 మంది బాధితలకు, సుమారు 34 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కలను అందజేశారు. దీనికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



# ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన మల్లెపూల నర్సయ్య

**సమయజ్యోతి న్యూస్ జూలై 21 బజార్ హత్నూర్**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన మల్లెపూల నర్సయ్య కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాయితీగా నిబద్ధతతో కష్టపడిన నాయకునికి దక్కిన గౌరవం అని మల్లెపూల నర్సయ్య ను గ్రంథాలయ చైర్మన్ గా నియమించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. కచ్చితంగా పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తకు న్యాయం చేస్తామని తెలిపారు. నేను కూడా గ్రంథాలయాల్లో చదువుకొని సివిల్ ఇంజనీర్ గా ఉద్యోగం సాధించానని ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన తో రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు.ప్రతీ ఏటా గ్రంథాలయల అభివృద్ధి కోసం 50 లక్షల రూపాయలు కేటాయించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి సీ సీ బి బ్యాంకు చైర్మన్ అడ్డి బోజరెడ్డి బోథ్, ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు బొడ్డు గంగారెడ్డి, సత్యవతి కొటేశు బోథ్ ఇచ్చోడ బ్లాక్ ఆత్మ చైర్మన్లు గొర్ల రాజు యాదవ్, అశోక్ లు నియోజకవర్గం లోని అన్ని మండలాల నుండి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అఖిల భారత జాతీయ రక్షా సేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

అఖిల భారత జాతీయ రక్షా సేన పార్టీ కార్యాలయం ను ఆదిలాబాద్ జిల్లా జోనల్ అధ్యక్షుడు షేక్ అస్లం నేతృత్వంలో పట్టణంలోని స్థానిక అబ్దుల్లా చౌక్,సాత్నాలా రోడ్ వద్ద పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా పార్టీ పదవులను ప్రధానం చేశారు.ఎస్సీటౌన్ అధ్యక్షుడిగా దీపక్ షిండే, జైనథ్ మండల్ అధ్యక్షుడిగా గెడం నితీష్,పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎండి సుభానీ ఖాన్,సాత్నాలా మండల అధ్యక్షుడిగా గులాబ్ రావు ను నియమించారు.ఈ సందర్భంగా చాలా మంది యువకులు పార్టీలో చేరారు.



# అమరచింత లో ఘనంగా మల్లిఖార్జున్ ఖార్గే జన్మదిన వేడుకలు.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ప్రతిపక్ష నాయకులు మల్లిఖార్జున ఖర్గే పుట్టినరోజు సందర్భంగా కార్యకర్తలతో కలిసి కేక్ కటింగ్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అమరచింత మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అమరచింత పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ లు మహంకాళి విష్ణు,పి. తిరుమలేష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పోషిరిగారి విష్ణు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జె. ప్రకాశం, యువజన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు శ్యామ్, ఎస్టీ సెల్ మండల అద్యక్షుడు హన్మంతు నాయక్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ తౌఫీక్, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు హరీష్ నాయక్, ఐ ఎన్ టీ యు సి మండల అధ్యక్షుడు ప్రభుదాస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పి. విష్ణు,శ్యామ్,రవికాంత్ ,మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి ,పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యారెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు విజయ్, వీరేష్ గౌడ్,జానిస్ట్ ,దేవరాజు,సవరన్న, సొమ్లు నాయక్ ,మహేష్, మహిమూద్,తిరుపతి ,రికో ,రవి దలాలు,శరత్,రాములు నాయక్ ,సుధాకర్,యెబు తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ఆజాద్ సమాజ్ పార్టీ 10వ వార్షికోత్సవ వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా ఆదిలాబాద్ లో ఆజాద్ సమాజ్ పార్టీ పదవ వార్షికోత్సవ వేడుకలను జై జవాన్ నగర్ కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలు వాటి జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల్ మరియు భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా కేక్ ను కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుమ్ రజా,పట్టణ మహిళా సెల్ అధ్యక్షురాలు అనిత కాంబ్లె,పార్టీ కార్యకర్తలు మహేష్ సిండే,కే సుమిత్,షేక్ ఇక్రాముద్దీన్,షేక్ అయాన్,షేక్ జబ్బార్,బదురుద్ రతన్ హెూకే,షేక్ ఫారుక్,షేక్ సలీం,షేక్ అహ్మద్,షాహిదా బేగం,ఫిర్దోస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




# పోచమ్మ పండుగకు ముస్తాబైన దేవాలయం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల కేంద్రంలో మంగళవారం అంగరంగ వైభవంగా కనుల పండుగ గ్రామ దేవత శ్రీ శ్రీ పోచమ్మ తల్లి వేడుకలను జరుపుకుంటారు. పోచమ్మ దేవాలయంను రంగులతో, విద్యుత్ కాంతులతో అలంకరించారు.మంగళవారం ఆడపడుచులు పట్టు వస్త్రాలు ధరించి బోనమెత్తి పోచమ్మ తల్లికి టెంకాయలు, కోళ్లు, మేకలు పొట్టేలను నైవేద్యంగా అమ్మవారికి సమర్పించి మొక్కలు తీర్చుకుంటారు. భక్తులకు దేవాలయం వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు.



# స్థానిక సంస్థల ఎన్నికల కోసం మండలాల్లో బిజెపి వర్క్ షాప్ కార్యక్రమాలు.

## - ఎమ్మెల్యే పాయల్ శంకర్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాలలో బీజేపీ వర్క్ షాప్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.సోమవారం బేల మండల కేంద్రంలో నిర్వహించిన వర్క్ షాప్ లో ఆయన మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా పార్టీ నాయకులు సన్నద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.గత పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బిజెపికి ప్రజలంతా నిండు మనసుతో ఆశీర్వదించారని అన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత బలాన్ని ఇస్తే ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాటాలు చేపడుతామన్నారు.ఎన్నికల సమయంలో అమలు చేస్తున్న ఏ ఒక్క హామీని కూడా సరైన రీతిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో ఎండ్రాల నగేష్,మురలీధర్,ఇంద్రజిత్,విజయ్,రాము,సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# సాగంటి వారి ఇంట బోనాల జాతరంట తెలంగాణ సంస్కృతి

**సమయజ్యోతి ప్రతినిధి హన్మకొండ**

సంప్రదాయాలను నేటి తరం పిల్లలకు అలవాటు చేయాలని, ఈ పర్వదినాలలో వారిని భాగస్వాములను చేయాలని సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంజుల సాగంటి అన్నారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ లో జూలై 21 తెలంగాణ బోనాల సందర్భంగా సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం "సాగంటి వారి ఇంట బోనాల జాతరంట" అనే పేరుతో వివిధ రకాల పోటీలలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ప్రత్యేక వేషాధారణ కార్యక్రమంలో చిన్నారులు బోనాల ప్రత్యేకతను చాటి చెప్పేలా పండగ కు సంబంధించిన ప్రత్యేక దుస్తులతో ఆహుతులను అలరించారు.. ఇదే అంశం పై చిత్రలేఖన పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులను, సర్టిఫికేట్లను అందించారు. ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనం లోని నగర ప్రముఖ కవులు వారి కవితలను వినిపించిన అనంతరం సంస్ డైరెక్టర్ వారికి ఆత్మీయ సన్మానాలు చేసారు. తెలంగాణ సంస్కృతి ప్రపంచ దేశాలకు చాటి చెప్పాలనేది వారి ఉద్దేశమని సంస్థ ముఖ్య సలహాదారులు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా రాజేంద్రప్రసాద్, కవిత, మానస తదితరులు పాల్గొన్నారు... ముఖ్య అతిధులుగా రియాజ్ తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్, అజీజ్ ఖాన్ హనుమకొండ జిల్లా గ్రంథాలయాల సంస్థ అధ్యక్షులు, విశ్రాంత ఆచార్యులు బన్న ఐలయ్య, కె విజయ బాబు, సిరాజుద్దీన్, ఎసిపి విజయకుమార్, ఆర్టిస్ట్ చిప్పకుర్తి శ్రీనివాస్, అడ్వకేట్ రవి కుమార్ మరియు నగరం లోని ప్రముఖ కవులు పాల్గొన్నారు..



# నిజాంను నిగ్గదీసిన కవి దాశరథి

## నేడు దాశరథి కృష్ణమాచార్య జయంతి

**వరంగల్,జూలై21(సమయజ్యోతి):**



నిజాం అరాచకాలకు నిలదీసిన కవి దాశరథి కృష్ణమాచార్య. ఓ నిజాం పిశాచమా అంటూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. దాశరథి కృష్ణమాచార్య ఉమ్మడి వరంగల్ జిల్లా మానుకోట తాలూకా చిన్నగూడూరు గ్రామంలో జూలై 22, 1925న జన్మించాడు. వెంకటమ్మ, వెంకటాచార్యులు ఆయన తల్లిదండ్రులు. తల్లి నుండి మానవత్వం, తండ్రి నుండి పాండిత్యం అతనికి చిన్ననాటి నుంచే ఒంటబట్టాయి...'ఓ నిజాము పిశాచమా! కానరాడు..నిన్ను బోలిన రాజు మాకెన్నడేని..తీగలను తెంపి అగ్నిలోకి దింపినావు..నా తెలంగాణ కోటి రత్నాల వీణ..ఈ పద్యం వినని, తెలియని తెలంగాణావారుండరు. ఒక్కోసారి అన్పిస్తుంది ఇలాంటి పద్యాలే కవులు రాయకపోతే తెలంగాణ ప్రాంతీయ స్పృహ అందరిలో పుట్టేదా? అని. అటువంటి పద్యాలు, వచనాలు ఎన్నో ఈనేలన పురుడు పోసుకున్నాయి. మానులై ఎన్నో విజయాలూ అందించుటలో సహకరించాయి. అలాంటి ఉద్యమ సాహిత్యం, అభ్యుదయ సాహిత్యంలో తెలంగాణా అనగానే సాధారణంగా గుర్తొచ్చే కవి దాశరథి కృష్ణమాచార్యులు.నిజాం నిరంకుశ పాలనను, భూస్వామ్య వ్యవస్థను, పెట్టుబడిదారి వ్యవస్థను, అన్యాయం, అధర్మం ఉన్న ప్రతి చోటా కవితాశక్తి ధిరోదాత్తుడై కనిపించినవాడు దాశరథి. ఆయనలోని కవితాధార ఎందరో పీడించేవారిని గజగజ వణికించింది. అది అగ్నిధారై ప్రవహించింది. రుద్రవీణై వినిపించింది. అమృతాభిషేకం కురిపించి కవితా పుష్పకంలో వికసించింది. అట్లాంటి తెలంగాణా వైతాళికుడు దాశరథి. దగాకోరు బడాచోరురజాకారు పోషకుడవువూళ్ల కూళ్లు అగ్గివెట్టిఇళ్లన్ని కొల్లగొట్టిపెద్దరికం చేస్తావాదిగి పొమ్మని- దిగి పొమ్మని పదేపదే అనేస్తానుదిగిపోవోరు-తెగిపోవోరు' అంటూ నిజాంను నిలదీశాడు. తర్వాత అరెస్టయి నిజామాబాద్ జైల్లో బంధించబడినాడు. అయినను ఎక్కడా వెనుదిరగక అనేకానేక రచనలు చేశారు. నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ జైలు గోడలపై బొగ్గుతో రాసి మన తెలంగాణ మట్టి పౌరుషాన్ని అడుగడుగునా ప్రదర్శించిన అసలైన, నిఖార్సయిన తెలంగాణా కవి దాశరథి కృష్ణమాచార్యులు.

# హెచ్‌సిఏ అక్రమాల్లో కెటిఆర్, కవిత

## తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురువారెడ్డి

**హైదరాబాద్,జూలై21(సమయజ్యోతి):**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అక్రమాల్లో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ప్రమేయముందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురువారెడ్డి ఆరోపించారు. పదేళ్లుగా రాష్ట్రంలోని క్రికెట్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారని.. చాలా మందికి క్రికెటర్లకు గుర్తింపు లేకుండా చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీ-ఆర్, కవితతో పాటు హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంపత్‌కుమార్‌ను తక్షణమే విచారించాలి. వారి తప్పుడు నిర్ణయాల వల్ల గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం జరిగింది. సమ్మర్ క్యాంపులను ఉచితంగా నిర్వహించాలి. కానీ డబ్బులు తీసుకున్నారు. దానికి మా వద్ద ఆధారాలున్నాయి. ఆ డబ్బంతా ఎక్కడికి పోయింది. అవకాశాల కోసం తెలంగాణ క్రికెటర్లు ఎదురుచూస్తున్నారు. హెచ్‌సీఏలో జరిగిన అక్రమాల వివరాలను సీఐడీ, ఈడీకి అందజేస్తాం. హెచ్‌సీఏ కార్యవర్గాన్ని రద్దు చేయాలి. హెచ్‌సీఏ ఎన్నికపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. క్రికెట్‌తో సంబంధం లేని జగన్మోహన్‌రావు ఎలా అధ్యక్షుడు అయ్యారు?ఆయన వెనుక కేటీ-ఆర్, కవిత ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎలా ఓట్లు- వేస్తారు?ఐపీఎస్ అధికారి సజ్జనార్ కూడా ఎన్నికల్లో పాల్గొన్నారు. 155 క్రికెట్ అసోసియేషన్లు యాక్టివ్‌లో లేవు. అలాంటి వాటికి ఎన్నికలు ఎలా నిర్వహించారు?వెంటనే ఎన్నికలు రద్దు చేసి క్లబ్బులను ప్రక్షాళన చేయాలని గురువారెడ్డి డిమాండ్ చేశారు.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

## బ్యాంకింగ్ రంగ షేర్లకు కలిసొచ్చిన కాలం

**ముంబయి,జూలై21(సమయజ్యోతి):**

నష్టాలను వీడి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. విశ్లేషకుల అంచనాలను మించి త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు రాణించడం సూచీలకు కలిసొచ్చింది. దీంతో రెండ్రోజుల వరుస నష్టాల తర్వాత సూచీలు బయటపడ్డాయి. మరోవైపు రికార్డు త్రైమాసిక ఫలితాలను ప్రకటించినప్పటికీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 81,918.53 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,757.73) స్వల్ప లాభాల్లో ప్రారంభమై వెంటనే నష్టాల్లోకి జారుకుంది. కాసేపటి తర్వాత మళ్లీ లాభాల్లోకి వచ్చిన సూచీ.. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,274.03 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 442.61 పాయింట్ల లాభంతో 82,200.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122.30 పాయింట్ల లాభంతో 25,090.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.30గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్ షేర్లు రాణించాయి. రిలయన్స్, హెచ్‌సీఎల్ -టె-క్నాలజీస్, హిందుస్థాన్ యూనిలీవర్, టీ-సీఎస్, ఐటీ-సీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69.04 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3374 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఉద్దేశ్యపూర్వకంగానే తనపై దాడి

## పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

## పార్టీకి చెందిన వారే దాడికి పాల్పడ్డారు

## కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆరోపణ

**హైదరాబాద్,జూలై21(సమయజ్యోతి):**

ఆదివారం రాత్రి తనపై జరిగిన దాడి యత్నంపై సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ స్పందించారు. తనపై ఉద్దేశ్యపూర్వకంగానే దాడి ప్రయత్నం జరిగిందని, తనకు కొందరిపై అనుమానం ఉందని తెలిపారు. తన నియోజకవర్గంలో తన పార్టీకి చెందిన ఓ నేత టార్గెట్ చేశారని స్పష్టం చేశారు. సదరు నేత రౌడీయిజం చేస్తాడని, గతంలో అతనిపై హత్య కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. తనపై దాడికి ప్రయత్నం చేసిన వారంతా బయట నియోజకవర్గానికి చెందిన వారే అని, అందులో కొందరిని తాను గుర్తు పడుతా అని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ చెప్పారు. ఈరోజు ఉదయం సికింద్రాబాద్ ఎమ్మెల్యే ఎన్టీవీతో ప్రత్యేకంగా మాట్లాడారు. తనపైన ఉద్దేశ్యపూర్వకంగానే నిన్న రాత్రి దాడి ప్రయత్నం జరిగింది. నాకు కొందరిపై అనుమానం ఉంది. నా నియోజకవర్గంలో మా పార్టీకి చెందిన ఓ నేత నన్ను టార్గెట్ చేశారు. అతను రౌడీయిజం చేస్తాడు, గతంలో అతనిపై హత్య కేసులు ఉన్నాయి. గత శుక్రవారం నార్త్ జోన్ డీసీపీని కలసి ఫిర్యాదు చేశానని,నా సన్నిహితులను బయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నిన్న దాడికి ప్రయత్నం చేసిన వారంతా బయట నియోజకవర్గానికి చెందిన వారేనని గణేశ్ అన్నారు. అందులో నేను కొందరిని గుర్తుపడుతా. మళ్లీ పోలీసులను కలిసి అన్ని వివరాలు రెండు రోజులో చెప్తా. పోలీసులు కేసు పారదర్శకంగా దర్యాప్తు చేయకపోతే నేనే వారి పేర్లు బయటపెడతా' అని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ తెలిపారు. మా గన్‌మెన్‌ల గన్స్ లాక్కున్నారా లేదా అని నేను చూడలేదు. నేను పోలీసులకు ఫిర్యాదు చేశాను. సీసీ కెమెరాల ద్వారా కేసు దర్యాప్తు చేస్తున్నారు. తాను రోడ్డుపై కారులో వెళ్తున్నాను. మా కార్ సైరన్ కొట్టిన మాట వాస్తవమే. సైరన్ కొడితే డ్రైవర్ దగ్గరికి రావాలి, డ్రైవర్ పైన అటాక్ జరగాలి. కానీ నన్ను ఎందుకు టార్గెట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మా ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉంది. మా ప్రభుత్వం ఇలాంటి రౌడీయిజాన్ని చూస్తూ ఊరుకోదని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ హెచ్చరించారు. మాణికేశ్వర్ నగర్‌లో ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మెల్యేపై ఆదివారం రాత్రి దుండగులు దాడికి యత్నించారు.

# లిక్కర్ మాఫియా గుప్పిట్లో ప్రభుత్వం

## కల్లు కాంపౌండ్‌లను ఎత్తేసే కుట్ర-కులవృత్తులను అగౌరవపరుస్తున్న కాంగ్రెస్

## మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

**హైదరాబాద్,జూలై21(సమయజ్యోతి):**



కుల వృత్తులను కాపాడుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని నాశనం చేయాలని చూస్తుందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఏ కుల వృత్తిపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆదాయం వచ్చే కుల వృత్తులను ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తోందన్నారు. గీత కార్మికులకు ఐదు ఎకరాల పొలం ఇస్తామని చెప్పారు. గీత కార్మికులు చెట్లపై నుంచి పడి చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లుగీత వృత్తిని బంద్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కల్లు కంపౌండ్ ద్వారా పది కులాలు బ్రతుకుతున్నాయి. ఉప్పల్‌లో తాటి చెట్లు-కొట్టి గీత కార్మికులకు నష్టం చేశారు. కల్లు కంపౌండ్‌ను నిషేధిస్తామని ప్రభుత్వం లీకులు ఇస్తోంది. లిక్కర్ కంపెనీలు, డిస్టలరీలన్ని ఒకరిద్దరి చేతుల్లో నడుస్తున్నాయి. లిక్కర్ కంపెనీల కమిషన్లకు కక్కుర్తిపడి, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లు కాంపౌండ్ బంద్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డరు. కల్లులో మీరే ఏదో కలిపి కుట్ర చేస్తూ ఓఆర్ఆర్ లోపల కల్లుపై నిషేధం విధించాలని చూస్తున్నారు. కుల వృత్తిని అవమానించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని నిషేధించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలం అవుతుంది. కల్తీ పాలు అరిటకట్టడంపై ప్రభుత్వం ఎందుకు దృష్టి పెట్టడం లేదు. రాష్ట్రంలో విచ్చలవిడిగా ఫార్మా కంపెనీలకు పర్మిషన్లు ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను తెలంగాణలో అమ్ముతున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఒక్కో ఎమ్మెల్యేకు 10 నుంచి 15 లక్షలు ఇస్తున్నారు. దాదాపు 35 మంది ఎమ్మెల్యేలు నెలవారీ డబ్బులు తీసుకుంటు-న్నారు. కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నది ఎవరనేది ప్రభుత్వం తేల్చాలి. గీత సంఘాల నుంచి ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకుంటూ కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నారా? బిఆర్ఎస్ హయాంలో జిల్లాకో నీరా కేంద్రం పెట్టాలని భావించాం. హైదరాబాద్ నగర నడిబొడ్డున నీరా కేఫ్ పెట్టి కులవృత్తిని కాపాడాం. కల్లు కంపౌండ్ దమ్ముంటే బంద్ చేసి చూడండి. కల్లు కంపౌండ్ బంద్ చేస్తే ప్రభుత్వాన్ని నడవనీయం. మళ్లీ కేసీఆర్ సీఎం కాగానే కల్లు దుకాణాలను తెరిపిస్తాం. వైన్ షాపులు కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఇస్తాం అని ప్రకటించారు. నిజామాబాద్ జిల్లాలో గౌడ కులస్తులపై నిషేధం విధించారు. 60 మంది గౌడ కుల స్త్రీలు గుడికి వెళ్తే గుళ్లోకి రావద్దని వెనక్కి పంపారు. లక్షలు, లక్షలు మామూళ్లు తీసుకుని కల్లు దుకాణాలు బంద్ చేస్తామంటే చూస్తూ ఊరుకోం. కల్లు దుకాణాలు బంద్ పెడితే బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద మామూళ్లు తీసుకుంటున్న ఎమ్మెల్యేల పేర్లు బయటపెడతాం. హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలో గీత చెట్లు- ఉన్నాయి. కల్లు కంపౌండ్ పేదోళ్లకు రిక్రియేషన్ సెంటర్ లాగా ఉంటు-ంది. తాము అధికారంలోకి వచ్చాక లిక్కర్ మాఫియా నుంచి, కల్లు కంపౌండ్ నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. అలాగే తాటి చెట్లు-నరికిన వారిపై కేసులు పెట్టాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీల పట్ల వివక్ష చూపుతున్నారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీకి గుర్తుకు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. 34 శాతం రిజర్వేషన్లపై 2013లో కాంగ్రెస్ పార్టీ కోర్టుకు అఫిడవిట్ ఇచ్చి, ఈసారికి మాత్రమే బీసీ రిజర్వేషన్లు అని చెప్పిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మూలంగానే ఏపీ, తెలంగాణలో బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నట్లు- తెలిపారు. బీసీలకు రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల రేవంత్ రెడ్డి. ఎప్పుడూ సానుకూలంగా లేరన్నారు. 2018లో మహారాష్ట్రలో ఆర్డినెన్స్ ఇచ్చి ఎన్నికలకు వెళ్తే నామినేషన్లు తర్వాత కోర్టు తీర్పు ద్వారా ఎన్నికలు ఆగిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లడంతోనే బీసీలకు గతంలో రిజర్వేషన్లు రాలేదన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాహుల్ గాంధీ వద్దకు తీసుకువెళ్లి కేంద్రంపై పోరాటం చేస్తామని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చి ఎన్నికలు నిర్వహించాలని భిక్షమయ్య గౌడ్ చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గం పర్యటన సందర్భంగా గౌడన్నలకు ఇస్తామన్న హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేసిన శ్రీకాంత్ అనే యువకుడిని కొట్టించారన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేస్తామని చెప్పి రేవంత్ రెడ్డి మాట తప్పారన్నారు. శ్రీకాంత్‌పై జరిగిన దాడికి సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. కల్లు అనేది ప్రకృతి పానీయమని, అలాంటి కల్లుని నిషేధించాలని ప్రభుత్వం చూస్తోందని కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. కల్తీ కల్లును కచ్చితంగా అరికట్టాలి. కానీ ఆ పేరుతో కల్లును నిషేదిస్తే ఖబడ్దార్ రేవంత్ రెడ్డి అని ఆయన హెచ్చరిం చారు. కల్లు మండువాలు, కల్లు గీత కార్మికుల జోలికి వస్తే రాజకీయంగా సంగతి తెలుస్తామన్నారు. కల్లుగీత కార్మికులకు 25 శాతం వైన్ షాపులు కేటాయిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని దుయ్యబట్టారు. కల్లుగీత కార్మికులను దొంగల్లా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, గీత కార్మికుల ఉసురు ప్రభుత్వానికి కచ్చితంగా తగులుతుందన్నారు. నీరా కేఫ్‌ను హైదరాబాద్ నగరంలో పెడితే కాంగ్రెస్ వచ్చాక ఆగం చేసిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గట్టు-రాంచందర్ రావు, నాగేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్ కేసు దర్యాప్తు ముమ్మరం

## రానా,విజయ్ దేవరకొండ,ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మిలకు నోటీసులు

## విచారణకు రావాలని ఆదేశించి ఇడి

**హైదరాబాద్,జూలై21(సమయజ్యోతి):**

బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ అధికారులు సినీ సెలబ్రిటీలకు షాక్ ఇచ్చారు. ఈ కేసులో ముమ్మరంగా విచారణ చేస్తున్న క్రమంలో బెట్టింగ్ యాప్ కేసులో నిందితులుగా ఉన్న సినీ సెలబ్రెటీలకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే పలువురిని పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని ఈడీ అధికారులు నోటీసులు పంపించారు. జులై 23న దగ్గుబాటి రానా, జులై30న ప్రకాష్‌రాజ్, ఆగస్ట్6న విజయ్ దేవరకొండ, ఆగస్ట్ 13న మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని నోటీసులో తెలిపారు. విదేశీ బెట్టింగ్ యాప్‌లను వీరు ప్రమోట్ చేసినట్లు- ఈడీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో వీరిని మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ చేయనున్నట్లు- తెలుస్తోంది.బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు ఆయా కంపెనీల నుంచి సినీ సెలబ్రెటీలకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై విచారణ చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు. సినీ సెలబ్రెటీలు బెట్టింగ్ యాప్‌లని ప్రమోట్ చేయడంతోనే పలువురు ఆకర్షితులు అయ్యారని ఈడీ అధికారులు, పోలీసులు చెబుతున్నారు. బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి అమాయకులు మోసపోయినట్లు అధికారులకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఈడీ అధికారులు, పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఎంతోమంది బెట్టింగ్ యాప్‌ల బారిన పడి ఆత్మహత్యలు చేసుకోవడంతో ఈడీ అధికారులు, పోలీసులు ఈ కేసుని సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతున్నారు.

# రియల్ విభేదాలే అనిల్ హత్యకు కారణం

## సొంత స్నేహితులే మట్టుబెట్టినట్లు నిర్ధారణ

**మెదక్,జూలై21(సమయజ్యోతి):**

మెదక్ జిల్లా కాంగ్రెస్ నేత అనిల్ హత్య కేసును పోలీసులు చేధించారు. ఆస్తి,పాతకక్షల వల్లే అనిల్ ను హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డిగా గుర్తించారు. హత్యకు గురైన అనిల్ గతంలో రవీందర్ రెడ్డి అనుచరుడిగా ఉండేవాడు. ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన వారు. ఈ కేసులో ఏ 1 కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి. ఏ2 నాగరాజు, ఏ 3 నాగభూషణంగా పోలీసులు చేర్చారు. మెదక్ ఎస్పీ శ్రీనివాస రావు చెప్పిన వివరాల ప్రకారం.. జులై 14న రాత్రి కాంగ్రెస్ నేత అనిల్ ను మెదక్, సంగారెడ్డి రూట్లో కొల్చారం మండల పరిధిలోని వరిగుంతం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో కాల్పులు జరిపి హత్య చేశారు. ఈ కేసులో ఏ 1 కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి. ఏ2 నాగరాజు, ఏ 3 నాగభూషణం చేర్చారు పోలీసులు. ఈ ముగ్గురికి అనిల్ అంటే ద్వేషం ఉంది. అనిల్ హైదరాబాద్ సహా పలుచోట్ల ల్యాండ్ సెటిల్ మెంట్లు చేశాడు. కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి అతని భార్య లక్ష్మి లకు అనిల్ అనుచరుడిగా ఉన్నారు. లక్ష్మి మరణం తర్వాత రవీందర్ రెడ్డికి, అనిల్ కు విభేదాలు వచ్చాయి. పెట్రోల్ బంకు విషయంలో ఇద్దరికి గొడవలు జరుగుతున్నాయి. రవీందర్ రెడ్డి కి సంబంధించిన 12 ఎకరాల భూమి విషయంలో ఇద్దరి మధ్య వివాదం ఉంది. గ్రామంలోనూ తనపై అనిల్ దుష్ప్రచారం చేస్తున్నారని రవీందర్ రెడ్డి కోపం పెంచుకున్నాడు. మరో ఇద్దరు నాగభూషణం, నాగరాజులకు కూడా అనిల్ తో గొడవలు ఉన్నాయి. అనిల్ తో పాటు- శేఖర్, నాగభూషణం అనే వ్యక్తి జులై14న గాంధీ భవన్ కి వెళ్లారు. హైదరాబాద్ లో ఓ సెటిల్ మెంట్ కోసం ముగ్గురు కలిసి వెళ్లారు. హత్య జరిగే వరకు నిందితులు అనిల్ తోనే ఉన్నారు. ఓ ఆల్టో కారు, మరో కారులో అప్పటికే అనిల్ ని హత్య చేయాలని ప్లాన్ చేసుకున్నారు. వరిగుంతం వద్ద షాబుద్దీన్ అనే వ్యక్తి అనిల్ పై కాల్పులు జరిపి హత్య చేశారు. అనిల్ హత్యకు ప్రధాన కారణం పాత కక్షలు, విబేధాలు. ఒక్కప్పుడు అనిల్ స్నేహితులే శత్రువులయ్యారు. ఈ కేసులో ఐదుగురు నిందితులని అరెస్ట్ చేశాం. ఇద్దరు పరారీలో ఉన్నారు. వారిని త్వరలో పట్టుకుంటాం అని ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు.

# కేరళ మాజీ సిఎం విఎస్ అచ్యుతానందన్ కన్నుమూత

## 101 ఏళ్ల వయసులో గుండెపోటుతో మృతి

## సిపిఎ ఏర్పాటు, ఉద్యమాల్లో కీలక భూమిక

## భూస్వాములపై పోరాటంలో అలుపెరగని నేతగా గుర్తింపు

**తిరువనంతపురం,జూలై21(సమయజ్యోతి):**

కమ్యూనిస్టు కురువృద్ధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ (101) కన్నుమూశారు. గత నెల 23న గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. ఆయన ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. 2006 నుంచి 2011 వరకు ఆయన కేరళకు సీఎంగా పనిచేసారు. అవిభక్త వామపక్ష పార్టీలో చీలిక తర్వాత సీపీఎంను స్థాపించిన వ్యక్తుల్లో అచ్యుతానందన్ కూడా ఒకరు. 1923 అక్టోబరు 20న కేరళలో వెనకబడిన ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన అచ్యుతానందన్.. లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు-.. ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలకఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేత. బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువు ఆపేసి... దర్జీ దుకాణంలో, కొబ్బరి పీచు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ.. జీవనం సాగించిన అచ్యుతానందన్ కార్మిక ఉద్యమంలో అడుగుపెట్టారు. 1940లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. స్వాతంత్ర్యానికి ముందున్న ట్రావెన్‌కోర్ సంస్థానంలో భూస్వాములపై పోరాటంలో భాగంగా జైలుకెళ్లటంతో ఆరంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం అంచెలంచెలుగా ప్రజా నేతగా ముఖ్యమంత్రి స్థాయికి చేరింది. 1964లో సీపీఐ జాతీయ కౌన్సిల్‌ను వదిలేసి.. సీపీఎం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1967 నుంచి 2016 దాకా కేరళ అసెంబ్లీకి ఎన్నికైన ఆయన ఒకసారి (2006-2011) ముఖ్యమంత్రిగా, మూడుసార్లు విపక్షనేతగా వ్యవహరించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో ఎన్నడూ వెనకంజ వేయని అచ్యుతానందన్... రాష్ట్రంలో భూ ఆక్రమణదారులపైనా ముఖ్యమంత్రిగా ఉక్కుపాదం మోపారు. ఈ చర్యలతో అనేకమంది వ్యతిరేకమైనా ఆయన వెరవలేదు. ప్రజలు.. పార్టీ మధ్య అంతరం వచ్చినప్పుడు మార్క్సిస్టు పార్టీ క్రమశిక్షణనూ పక్కనబెట్టి ప్రజల పక్షాన నిలబడటానికే పెద్దపీట వేశారు. ఈ క్రమంలో అవమానాలు ఎదురైనా తన నిజాయితీబాటను, నిరాడంబరతను ఏనాడూ వీడలేదు. పుట్టింది 1923లో అయినా... ఆధునిక అవసరాలను కూడా అర్థం చేసుకున్న నిత్య అధ్యయనశీలి. పాతతరంలో భూమి కొంతమంది చేతుల్లో కేంద్రీకృత మైనట్లుగా... సాంకేతిక ప్రపంచంలో సాఫ్ట్‌వేర్‌ల రూపంలో కొన్ని కంపెనీల



గుత్తాధిపత్యం సాగుతోందని గుర్తించిన ఆయన... అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ కోసం ఉద్యమించారు. 2016లో తన 93వ ఏట కూడా కమ్యూనిస్టులకు వీఎస్ విజయవీచిక అయ్యారు.

# వియస్ మృతికి సిపెం పోలిట్ బ్యూరో సంతాపం

## ఎనిమిదన్నర దశాబ్దాల

## అనుబంధం గుర్తు చేసుకున్న పార్టీ

**న్యూఢిల్లీ,జూలై21(సమయజ్యోతి):**



కమ్యూనిస్ట్ ఉద్యమంలో ప్రముఖ నేత, అనుభవజ్ఞుడు వి.ఎస్.అచ్యుతానందన్ (101) మృతికి పొలిట్‌బ్యూరో తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీతో ఎనిమిదన్నర దశాబ్దాల అనుబంధం కలిగిన వి.ఎస్.అచ్యుతానందన్.. కేరళలో కమ్యూనిస్ట్ ఉద్యమ స్థిరత్వానికి ఎంతగానో కృషి చేశారు. ప్రజావక్తగా ప్రజలతో నేరుగా సంభాషించే కళలో ప్రావీణ్యం సంపాదించారు. కఠినమైన జీవనశైలి, సామాజిక న్యాయం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తిగా గుర్తింపుపొందిన వియస్... కేరళ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆయన మృతి పార్టీకి, కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరని లోటని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఆయనకు నివాళిగా ఎర్రజెండాను అవనతం చేసింది. ఆయన భార్య, కుమారుడు, కుమార్తెలకు సానుభూతి ప్రకటించింది.వి.ఎస్ అని ముద్దుగా పిలుచుకునే అచ్యుతానందన్ కేరళలో వివిధ పోరాటాలకు నేతృత్వం వహించడమే కాకుండా సమర్ధవంతంగా నడిపించారు. కార్మికుడిగా ఆస్పిన్వాల్ కంపెనీలో పనిచేసిన సమయంలో కొబ్బరిపీచు కార్మికులను సంఘటిత పరిచారు. ఆ సమయంలోనే మొదటిసారి ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోకి అడుగుపెట్టారు. 17 ఏళ్ల వయస్సులో వియస్ 1940లో కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. కృష్ణ పిళ్ళై ఆయనను కుట్టనాడ్‌లో భూస్వాములతో భయంకరమైన దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కార్మికుల మధ్య పని అప్పగించారు. ట్రావెన్ కోర్ దివాన్‌కు వ్యతిరేకగా జరిగిన పున్నప్ర వాయిలార్ తిరుగుబాటు- సమయంలో వి.ఎస్. అజ్ఞాతంలోకి వెళ్లారు. అరెస్టు తర్వాత పోలీసులు ఆయనను తీవ్రమైన హింసకు గురిచేశారు. 1956లో ఐక్య కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ-కి, 1958లో జాతీయ మండలికి ఎన్నికయ్యారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్)ను స్థాపించిన జాతీయమండలిలో మిగిలి ఉన్న 32 మంది సభ్యుల్లో ఆయన చివరి వ్యక్తి. ఆయన 1980-1991 వరకు సిపిఐ(ఎం) కేరళ రాష్ట్ర కమిటీ- కార్యదర్శిగా పనిచేశారు. 1964లో పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1985లో పొలిట్‌బ్యూరో సభ్యుడయ్యారు. వయస్సు రీత్యా 2022లో ఆయనను కేంద్ర కమిటీ- నుండి రిలీవ్ చేయగా, ఆ తర్వాత ప్రత్యేక ఆహ్వానితునిగా వున్నారు. కేరళ అసెంబ్లీకి ఏడు పర్యాయాలు ఎన్నికయ్యారు. రెండు పర్యాయాలు ప్రతిపక్ష నేతగా పనిచేశారు. 2006 -2011 మధ్య కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టారు.

# అట్టడుగువర్గాలకు అండగా నిలిచిన వియస్

## సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి ఎం.వి.గోవిందన్ సంతాపం

**తిరువనంతపురం,జూలై21(సమయజ్యోతి):**

అనారోగ్య సమస్యలతో సోమవారం మధ్యాహ్నం వి.ఎస్. అచ్యుతానందన్ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతికి సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి ఎం.వి.గోవిందన్ సంతాపం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. వి.ఎస్ అట్టడుగు వర్గాల ఉద్యమాన్ని బలోపేతం చేసిన పోరాట యోధుడని అన్నారు. కేరళలోని లెక్కలేనన్ని పోరాటాలను నడిపించిన ధృడ సంకల్పం ఆయనదని అన్నారు. కేరళతో పాటు- భారతదేశంలో కమ్యూనిస్ట్ పార్టీని ముందకు తీసుకువెళ్లడంలో ఆయన ప్రత్యేక పాత్ర పోషించారని అన్నారు. ఏ సమాజాని-కై-నా స్ఫూర్తినిచ్చే శక్తి కామ్రేడ్ వి.ఎస్ అని అన్నారు.


# కేరళ రాజకీయాల్లో అరుదైన ముద్ర

## పార్టీ పటిష్టంలో కీలక భూమిక

## ప్రజాపోరాటంలోఅలుపెరగని వియస్

**తిరువనంతపురం,జూలై21(సమయజ్యోతి):**

కేరళ రాజకీయ చరిత్రలో వి.ఎస్.అచ్యుతానందన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఆయన మృతితో పోరాట గాథ మసకబారింది. ప్రజల పక్షాన నిలిచి, ప్రజల హృదయాల్లో ఉన్న నేతల్లో ఒకడిగా వి.ఎస్.తన జీవితాన్ని కొనసాగించారు. వి.ఎస్. అనే రెండు అక్షరాల ద్వారా కేరళ ప్రజల మనస్సులలో విప్లవాత్మక వెలుగుగా నిలిచిన ప్రముఖ నేత ఇప్పుడు వారి జ్ఞాపకాలలో ఒక నిరంతర ప్రేరణగా నిలిచిపోతారు. వి.ఎస్.అచ్యుతందన్, 1923 అక్టోబర్ 20న అలప్పుజా జిల్లాలోని అయ్యన్ శంకరన్, అక్కమ్మ అలియాస్ కార్తియాయని దంపతులకు రెండవ కుమారుడిగా జన్మించారు. పున్నప్ర పరవూరు ప్రభుత్వ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. వియస్ బాల్యమంతా పేదరికంతో నిండిపోయింది. ఆయనకు నాలుగేళ్ల వయస్సులో తల్లి అక్కమ్మ మశూచితో మరణించారు. ఏడవ తరగతిలో ఉన్నప్పుడు తండ్రి కూడా మరణించారు. చదువు మధ్యలో ఆపేసి తన సోదరుని వస్త్ర దుకాణంలో సహాయకుడిగా చేరారు. తర్వాత ఆయన అలప్పుజలోని ఆస్పిన్‌వాల్ కాయిర్ కంపెనీలో కార్మికుడిగా చేరారు. ఆ కంపెనీలో మూడేళ్లు పనిచేశారు. 17 సంవత్సరాల వయసులో వియస్ అచ్యుతానందన్ కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. వియస్‌లో నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్సహించింది పి.కృష్ణపి÷-ల్లై. సిపిఐ(ఎం) పార్టీ పట్ల కుట్టనాడ్ వ్యవసాయ కార్మికుల్లో పార్టీని ప్రోత్సహించారు. పున్నప్ర వాయలార్ పోరాటం సమయంలో మరియు తర్వాత ఎమర్జెన్సీ సమయంలో ఆయన అరెస్టు అయ్యారు. 1943లో, ఆయన కోజికోడ్‌లో జరిగిన కమ్యూనిస్ట్ పార్టీ సమావేశంలో అలప్పుజ నుండి ప్రతినిధిగా పాల్గన్నారు. పున్నప్రా-వాయలార్ పోరాటంలో, పార్టీ సూచనలను అనుసరించి ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. కొట్టాయంలోని పూంజర్‌లో దాక్కున్నప్పుడు ఆయన అరెస్టు చేయబడ్డారు. పోలీసులు దారుణంగా కొట్టిన తర్వాత, వియస్‌ను చనిపోయాడని భావించి అడవిలోకి విసిరేయడానికి తీసుకెళ్లారు, కానీ ఆయన సజీవంగా కనిపించడంతో కొట్టాయంలోని ఆసుపత్రిలో చేర్చారు. ఆస్పత్రి నుండి బయటకు వచ్చిన తర్వాత, వి.ఎస్. ప్రజా పోరాటాలలో ముందంజలో నిలిచారు. అవినీతి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా రాజీపడకుండా పోరాడారు. 1956లో పార్టీ రాష్ట్ర కమిటీ- సభ్యుడిగా, 1957లో అలప్పుజ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1958లో జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1964లో అవిభక్త పార్టీ నుండి ఉద్భవించిన 32 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులలో కేరళ నుండి వచ్చిన ఏడుగురిలో వి.ఎస్. ఒకరు. 1964లో కోల్‌కతాలో జరిగిన పార్టీ మహాసభలో వి.ఎస్. కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1985లో ఆయన పొలిట్‌బ్యూరో సభ్యుడయ్యారు. 2016లో అధికారంలోకి వచ్చిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంలో వి.ఎస్. పరిపాలనా సంస్కరణల కమిషన్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు.



# 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం

## సాధ్యం కాదని తెలిసీ

## బిసీ ఓట్ల రాజకీయం

## రిజర్వేషన్లను తొమ్మిదో

## షెడ్యూల్‌లో ఎలా పెడతారు

## ఢిల్లీలో మీడియా సమావేశంలో

## బిజెపి అధ్యక్షుడు రామ్

**న్యూఢిల్లీ,జూలై21(సమయజ్యోతి):**

బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం, భాజపాపై నిందలు వేస్తే ఊరుకోబోమని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని.. సాధ్యం కాదని తెలిసినా బిల్లు తీసుకొచ్చారని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసినా.. ఓటు- బ్యాంకు పాలిటిక్స్ కోసం మోసం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రామచంద్రరావు మాట్లాడారు. అసాధ్యమైన పనిని కేంద్రంపైకి నెట్టివేస్తున్నారన్నారు. భాజపా, కేంద్ర ప్రభుత్వంపై నిందలు వస్తే ఊరుకోం. మీకు న్యాయ సలహాదారులు లేరా?ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ తీసివేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. ముస్లింలకు ఇచ్చినవి రాజకీయ రిజర్వేషన్లు.. అందుకే వ్యతిరేకిస్తున్నాం. 42 శాతం బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లోకి తీసుకురాలేం. దానికి సుప్రీంకోర్టు అనుమతించదు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదని రామచంద్రరావు ప్రశ్నించారు. పార్టీని ఎలా నడిపించాలనే విషయంపై పెద్దల మార్గదర్శనం తీసుకునేందుకు ఢిల్లీకి వచ్చానని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. 46 సార్లు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దక్కలేదన్నారు. కానీ ప్రధానమంత్రి సహా కేంద్ర మంత్రులందరూ ఎప్పుడు అడిగితే అప్పుడు రేవంత్ రెడ్డికి సమయం ఇచ్చారని, మీ పార్టీ ముఖ్యమంత్రికి మీరే ఎందుకు సమయం ఇవ్వడం లేదు చెప్పాలన్నారు రామచందర్ రావు. మతపరమైన రిజర్వేషన్లను మేము వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టడం కేంద్రం బాధ్యత అని అని అంటున్నారని, లీగల్ ఒపీనియన్ లేకుండా ఆర్డినెన్స్ తీసుకువచ్చారన్నారు. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టే అంశాలు కూడా న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని కేశవనంద భారతి కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, 2006లో అయ్యర్ కోహ్లీ కేసులో .. సుప్రీంకోర్టు మరోసారి కేశవనంద భారతి కేసు తీర్పు ను దగ్గర మరోసారి పునరుద్ఘాటించిం దన్నారు. తెలంగాణ బీసీలను తప్పుదోవ పట్టించేందుకు ముఖ్యమంత్రి ఆర్డినెన్స్ తెచ్చారని, న్యాయపర మైన చిక్కులు తెలిసి ...బీసీలను మోసం చేస్తున్నందుకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలన్నారు. బీసీ బిల్లుకు, ఆర్డినెన్స్ కు మద్దతు ఇచ్చాం.. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. ఎన్నికలు జరగకుండా ఉండేందుకు జరిగే ఎత్తుగడే ఈ మోసమని ఆయన ఆరోపించారు. తమిళనాడు తీర్పు నేపథ్యంలో ...తొమ్మిదో షెడ్యూల్ లో పెట్టే పరిస్థితి లేదని, పార్టీ క్రమశిక్షణ దాటితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు రామచందర్ రావు. నాయకులందరూ పార్టీ విధానాలకు లోబడే పని చేయాలని, ఈ అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కాంగ్రెస్‌లో రేవంత్ రాజగోపాల్ రెడ్డి మధ్య సమస్యలు.. బీఆర్ఎస్ లో కవితకు పార్టీకి మధ్య గొడవలు ఉన్నాయన్నారు. ప్రతి పార్టీలోనూ గొడవలు ఉన్నాయి వాటిని అంతర్గతంగా పరిష్కరించుకుంటామన్నారు.



# తొలిరోజు లోక్‌సభలో గందరగోళం

## విపక్షాల నిరసనల మధ్యే

## నేటికి వాయిదా

**న్యూఢిల్లీ,జూలై21(సమయజ్యోతి):**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు తొలిరోజే వాడీవేడిగా జరిగాయి. పెహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్, ఎయిర్ ఇండియా ప్రమాదాలపై ప్రధాని మోడీ స్పందించాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. సభ మొదలైన కాసేపటికే ఆపరేషన్ సింధూర్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యంపై నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అయితే ఈ విషయంపై తర్వాత చర్చల్లో అనుమతిస్తానంటూ స్పీకర్ ఓం బిర్లా చెప్పినా.. ప్రతిక్ష ఎంపీలు ప్రధాని మోడీ వివరణ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దాంతో ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్యే.. సభ ప్రారంభమైన 20 నిమిషాలకే మధ్యాహ్నం వాయిదాపడింది. తిరిగి ప్రారంభమైన మళ్లీ 2 గంటలకు.. ఆ తర్వాత 4 గంటలకు వాయిదాపడింది. ఈ అంశాలపై ప్రతిపక్షాలు పట్టువీడకపోవడంతో స్పీకర్ ఓంబిర్లా సభను నేటికి వాయిదా వేశారు.

# ఇడి కేసు కొట్టివేతపై సిద్ధరామయ్య ఆనందం

## రాజకీయ వేధింపులకు ఇడిని ఉపయోగించారని ఆరోపణ

## సుప్రీం తీర్పును స్వాగతిస్తూ పోస్ట్

**బెంగళూరు,జూలై21(సమయజ్యోతి):**

ముడా కేసులో సిద్ధరామయ్య భార్యపై ఇడి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కోర్టు కొట్టివేసింది. సుప్రీం తీర్పును సోమవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వాగతించారు. ఈ తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపదెబ్బగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 'మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- (ముడా) స్థల కేటాయింపు విషయంలో నా భార్య పార్వతిని దర్యాప్తు చేయాలన్న ఇడి విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక ఉత్తర్వు కేంద్ర ప్రభుత్వానికి చెంపదెబ్బ. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్, జస్టిస్ కె. వినోద్‌చంద్ర ఆదేశాలను నేను వినయంగా స్వాగతిస్తున్నాను. నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో నేను ఎల్లప్పుడూ రాజ్యాంగానికి, చట్టానికి తలవంచాను. ఈ నమ్మకాన్ని సుప్రీంకోర్టు తీర్పు సమర్థించింది... రక్షించింది' అని సిద్ధరామయ్య ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. బిజెపి ఇడి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థల్ని దుర్వినియోగం చేస్తోంది. ఈ సంస్థల ఆరోపణలు వేధింపుల వల్ల తాను ఎంతో మానసిక క్షభకు గురైనట్లు- సిద్ధరామయ్య అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక తన భార్యపై తప్పుడు కేసు బనాయించి.. బిజెపి ఇడి, సిబిఐ వంటి సంస్థల ద్వారా వేధింపులు ఎదుర్కొనేలా చేసింది. దీనివల్ల తన కుటుంబం పడిన మానసిక క్షోభ ఎప్పటికీ మరవలేను అని ఆయన అన్నారు.రాజకీయ పోరాటాలు ఓటర్ల మధ్య జరగాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేయడం ద్వారా కాదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి మాటలు రాజ్యాంగాన్ని విశ్వసించే ప్రతి మనస్సాక్షిగల భారతీయుడి అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయి' అని సిద్ధరామయ్య పోస్టులో పేర్కొన్నారు.

# రాజమండ్రి జైలులో వసతుల లేమి

## నేలపై పడుకోబెట్టారన్న మిథున్ రెడ్డి

## ఎసిబి కోర్టులో న్యాయవాదుల సవాల్

**విజయవాడ,జూలై21(సమయజ్యోతి):**

ఏపీ లిక్కర్ స్కాం కేసులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. లిక్కర్ స్కాం కేసులో ఏ4గా మిథున్‌రెడ్డి ఉన్నారు. ఆగస్టు1వ తేదీ వరకు రిమాండ్ విధించింది. దీంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు మిథున్‌రెడ్డిని తరలించారు. అయితే జైల్లో వసతులు కల్పించాలని మిథున్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో సోమవారం విచారణ జరిగింది.నోటీసు తీసుకోవటం లేదని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి దృష్టికి మిథున్‌రెడ్డి న్యాయవాదులు తీసుకువచ్చారు. మిథున్‌రెడ్డిని జైల్లో నేల మీద పడుకోబెట్టారని లాయర్లు చెప్పారు. మంచం ఇచ్చామని ప్రభుత్వ న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్‌తో మాట్లాడారు న్యాయమూర్తి. జైలు సూపరింటెడెంట్ కోర్టుకు రావాలని న్యాయమూర్తి ఆదేశించారు. డీఎస్పీను పంపిస్తామని న్యాయస్థానానికి సూపరింటెండెంట్ రాహుల్ తెలిపారు. కాగా.. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి రిమాండ్‌పై ప్రకటన విడుదల చేశారు. మిథున్ రెడ్డికి జైలు మెడికల్ ఆఫీసర్‌తో ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. బీపీ, హార్ట్‌రేట్, ఆక్సిజన్ స్థాయిలతో సహా అన్ని వైటల్స్ సాధారణ స్థాయిలో ఉన్నాయని వివరించారు. వైద్య పరీక్షల తర్వాత మిథున్‌రెడ్డిని బ్యారేక్‌కు తరలించామని చెప్పుకొచ్చారు. మిథున్‌రెడ్డి ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారని రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరిం-టెండెంట్ రాహుల్ పేర్కొన్నారు.

# రాజకీయ పోరాటాల్లో ఇడిని ఎందుకు లాగుతారు

## ఇవన్నీ బయట చూసుకోండి

## ముడా కేసులో ఇడిపై సుప్రీం ఆగ్రహం

## కేసును కొట్టివేస్తూ తీర్పు

**న్యూఢిల్లీ,జూలై21(సమయజ్యోతి):**

కర్ణాటకలోని రూ.వందల కోట్ల విలువైన మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కుంభకోణానికి సంబంధించి.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణి బీఎం పార్వతికి సమన్లు జారీ చేయడాన్ని క్వాష్ చేస్తూ హైకోర్టు తీసుకొన్న నిర్ణయాన్ని ఈడీ సుప్రీంలో సవాలు చేసింది. దీనిని తాజాగా అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈసందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ యుద్ధాలు కోర్టు బయట చేసుకోవాలని పేర్కొంది. అలాంటి పోరాటాలకు ఈడీని ఎందుకు వాడుతున్నారని ప్రశ్నించింది. దురదృష్టవశాత్తూ నాకు మహారాష్ట్రలో అనుభవం ఉంది. మేము మాట్లాడేటట్లు- ఒత్తిడి చేయొద్దు. ఒకవేళ అలాచేస్తే.. మేము ఈడీ గురించి కఠిన విషయాలు చెప్పాల్సి ఉంటుంది. ఎన్నికల్లో రాజకీయ యుద్ధాలు చేసుకోనివ్వండి. మిమ్మల్ని ఎందుకు వాడుతున్నారని ప్రశ్నించింది. ఈసందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు స్పందిస్తూ తాము పిటిషన్‌ను ఉపసంహరించుకొంటామని పేర్కొన్నారు. ఆ తర్వాత కోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. హైకోర్టు సింగిల్‌బెంచ్ జడ్జి తీసుకొన్న నిర్ణయంలో ఎటువంటి లోపం లేదని పేర్కొంది. మైసూరులోని కెసరె గ్రామంలో సిద్ధరామయ్య సతీమణికి మూడు ఎకరాల భూమి ఉండేది. దానిని ఆమె సోదరుడు ఆమెకు కానుకగా ఇచ్చారు. అయితే అభివృద్ధి పనుల్లో భాగంగా 'ముడా' దానిని స్వాధీనం చేసుకుంది. పరిహారంగా 2021లో విజయనగర ప్రాంతంలో 38,283 చదరపు అడుగుల ప్లాట్లను కేటాయించింది. కెసరెలోని ల్యాండ్‌తో పోలిస్తే.. విజయనగరలో భూమి మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉంది. అదే విమర్శలకు కారణమైంది. ఆ తర్వాత ఆమె ఆ భూమిని సరెండర్ చేశారు. ఈక్రమంలో పార్వతికి ఈడీ జారీ చేసిన సమన్లను హైకోర్ట్ సింగిల్ బెంచ్ జడ్జి ఎం.నాగప్రసన్న క్వాష్ చేశారు. తాజాగా దీనిపైనే ఈడీ సుప్రీంలో అప్పీల్ చేసింది. ఈ వ్యవహారంపై ఇడి జోక్యంపై సుప్రీం మండిపడింది.

# నగరంలో పలుచోట్ల భారీ వర్షం

**హైదరాబాద్,జూలై21(సమయజ్యోతి):**

హైదరాబాద్ మహానగరంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసే అవకాశముందని ఇప్పటికే ట్రాఫిక్ పోలీసులు ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. అత్యవసరమైతే తప్ప.. అనవసరంగా ప్రయాణాలు చేయవద్దని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. ట్రాఫిక్ పోలీసులు, హైదరాబాద్ నగర పాలక సంస్థ, డీఆర్ఎఫ్ అందించే సమాచారాన్ని తెలుసుకుని.. వారి సూచనలు పాటించాలని విజ్ఞప్తిచేశారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ నగరంలో సైతం ఇటీ-వల పలు రోజులపాటు- వరుసగా వర్షాలు కురిసిన విషయం విదితమే. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు ప్రభుత్వం ఇప్పటికే సూచించింది. అలాగే ఉన్నతాధికారులకు సైతం ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో.. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బందిని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. మరోవైపు జులై 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పటికే భారత వాతావరణ విభాగం వెల్లడించిన సంగతి తెలిసిందే. అలాగే తెలంగాణలోని వివిధ జిల్లాల్లో సైతం భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో తెలంగాణలోని వివిధ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఈ వర్షాలు.. సోమ, మంగళవారాలే కాకుండా.. మరో రెండు రోజులు వరకు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. మరి ముఖ్యంగా తూర్పు, దక్షిణ, మధ్య తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే ఉదయం, సాయంత్రమే కాకుండా రాత్రి సమయాల్లో సైతం భారీ వర్షం కురుస్తుందని వివరించింది.

# మరో 681 మంది డయాలసిస్ పేషెంట్లకు చేయూత

**హైదరాబాద్,జూలై21(సమయజ్యోతి):**

డయాలసిస్ పేషెంట్లకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నూతనంగా 681 మంది డయాలసిస్ పేషెంట్లకు తెలంగాణ సర్కార్ చేయూత పెన్షన్లని మంజూరు చేయనుంది. దీంతో లబ్ధిదారుల సంఖ్య 4710కి చేరింది. ఈ మేరకు ఫైలుపై మంత్రి సీతకక్క సంతకం చేశారు.

# పల్నాడు జిల్లాలో ఘోరరోడ్డు ప్రమాదం

## లారీ, ఆటో ఢీకొని నలుగురు దుర్మరణం

**పల్నాడు,జూలై21(సమయజ్యోతి):**

జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం చోటు– చేసుకుంది. శావల్యపురం మండలం కనుమర్లపూడి వద్ద లారీ, ఆటో ఢీకొని నలుగురు మృతిచెందారు. మరో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సిబ్బందితో సహా హుటాహుటిన అక్కడికి చేరుకున్న సీఐ ప్రభాకర్ సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, మృతులంతా కారుమంచి వాసులుగా గుర్తించారు పోలీసులు. ఈ ప్రమాదంలో బత్తుల బ్రహ్మయ్య, నాగమూర్తమ్మ, రమణ, ముత్యాలమ్మ మృతిచెందినట్లు– పోలీసులు తెలిపారు. అనంతరం బాధిత కుటు–ంబసభ్యులు, బంధువులకు సమాచారం అందించారు. ప్రమాదం గురించిన తెలుసుకున్న ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. బాధితులను కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# ఆత్మకూరులో ఘనంగా ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు**

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదినం సందర్భంగా ఆత్మకూర్ గెస్ట్ హౌస్ లో పెద్ద ఎత్తున జన్మదిన వేడుక కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్,మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా,మాజీ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షులు తులసిరాజు యాదవ్, శ్రీను, అక్షర స్కూల్ దామోదర్, నాగేష్, గాలి పంపు శీను, ఈర్లదిన్నె శీను, గణేష్, ముదిరాజు, అబ్దుల్ జాంగిర్, మాజీ ఉపసర్పంచ్ గంగా తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఐఆర్ఎస్ నుంచి ఐపీఎస్‌కు: హోదా నుంచి హృదయానికి - చిత్తరంజన్ స్ఫూర్తిదాయక ప్రయాణం

## కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మార్పును తీసుకువస్తున్న యువ అధికారి

**సిర్పూర్ (టి), జూలై 21:సమయజ్యోతి**







ఈ రోజుల్లో సురక్షితమైన ఉద్యోగం, హోదా కోసం పరుగులు పడే కాలంలో, చిత్తరంజన్ జీవిత ప్రయాణం సేవా పథాన్ని ఎంపిక చేసుకునే ధైర్యానికి నిలువెత్తు నిదర్శనం. ప్రస్తుతం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అదనపు పోలీస్ సూపరింటెండెంట్ (%ూూూ%)లిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన, దేశంలోని రెండు ప్రతిష్టాత్మక సేవలలో సేవలు అందించిన అరుదైన వ్యక్తిగా నిలిచారు. ఓ సేవాధర్మాన్ని పునాదిగా వేసుకున్న కుటుంబంలో జన్మించిన చిత్తరంజన్, రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి రాధాకృష్ణమూర్తి మరియు రిటైర్డ్ వ్యవసాయ అధికారి హేమలత దంపతుల కుమారుడు. చిన్ననాటి నుంచే న్యాయబద్ధత, నైతికత, విద్యపట్ల ఆకర్షణతో ఎదిగిన ఆయన, విద్యా రంగంలో ఎల్లప్పుడూ ముందుండేవారు. యుపిఎస్సీ సివిల్స్‌లో ఉత్తీర్ణుడై 2017 బ్యాచ్‌లో ఇండియన్ రెవెన్యూ సర్వీస్ లో ఇన్కమ్ టాక్స్ డిప్యూటీ కమిషనర్గా పని చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను నడిపే కీలక విభాగాల్లో పని చేసిన అనుభవం ద్వారా ప్రజల సమస్యలపై లోతైన అవగాహన ఏర్పడింది. అయితే, నేరుగా ప్రజలతో పనిచేయాలనే ఆత్మతృప్తికరమైన ఆశయం ఆయనను మళ్లీ సివిల్స్ రాసేలా చేసింది. ఈసారి లిఇండియన్ పోలీస్ సర్వీస్ కు ఎంపికై, ప్రజలకు మరింత దగ్గరగా సేవ చేసే అవకాశం అందుకుంది. ప్రస్తుతం గిరిజన ప్రాంతాల్లో శాంతి భద్రతల బలోపేతానికి, నేరాల నివారణకు, యువతలో చైతన్యం నింపడానికి చిత్తరంజన్ ప్రతి అడుగూ స్ఫూర్తిగా నిలుస్తోంది. స్థానిక ప్రజలు ఆయనను కేవలం అధికారి కాదు, దగ్గరగా ఉండే మార్గదర్శిగా, ప్రేరణాత్మక నాయకుడిగా భావిస్తున్నారు. దృఢతకు తోడు దయతో కూడిన ఆయన శైలి, ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతోంది. ప్రత్యేకించి పల్లెల్లోని యువతకు "సాధ్యం కాదు" అనే భావనను తుడిచిపెట్టే ఉదాహరణగా మారుతున్నారు. "ఐఆర్ఎస్ నుంచి ఐపీఎస్" వరకు చిత్తరంజన్ ప్రయాణం వ్యక్తిగత విజయకథ మాత్రమే కాదు, ఇది దేశసేవ కోసం జీవితం అంకితం చేయగల వీరత్వానికి ప్రతీక. అధికారంలోకి రావడమే కాదు, ఆ పదవిని ప్రజల జీవితాలను మార్చేందుకు ఉపయోగించడమే నిజమైన నాయకత్వం అని ఆయన నిరూపిస్తున్నారు. ప్రత్యేక హోదాలు, సౌకర్యాలు వెతుక్కొనే సమాజంలో, చిత్తరంజన్ వంటి యువ అధికారి సమాజం కోసం కష్టాలు పడతానంటూ ముందుకు రావడం నిజంగా శ్లాఘనీయం. ఆయన జీవితగాథ ఇన్నాళ్లకీ కేవలం ఓ ఉద్యోగ ప్రయాణం కాదు %–% అది లక్షల మందికి స్ఫూర్తినిచ్చే పయనం.

# జిల్లా కలెక్టర్ లతో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి

## వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

రాష్ట్ర ముఖ్యమంత్రి సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా నీటిపారుదల,వ్యవసాయ రంగం,విత్తనాల పంపిణీ,ఇన్‌పుట్‌ల లభ్యత,భారీ వర్షాల ప్రభావం,ఆరోగ్య సవాళ్లు,రేషన్ కార్డుల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష చేపట్టారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా,అదనపు కలెక్టర్ శ్యామలా దేవి,ట్రైనీ కలెక్టర్ సలోని ఛాబ్రా,సబ్ కలెక్టర్ యువరాజ్,ఇతర సంబంధిత శాఖల అధికారులు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా చర్చించిన అంశాల్లో నీటిపారుదల: ప్రాజెక్టుల నుండి అవసరమైన మేరకు నీటి విడుదలపై సమీక్ష.,వ్యవసాయం: కాలానుగుణ వ్యవసాయ పరిస్థితులు,విత్తనాల లభ్యత,యూరియా వంటి ఇన్‌పుట్‌లు రైతులకు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు.,భారీ వర్షాలు: ఇటీవల కురుస్తున్న వర్షాల ప్రభావం,వరదలు,నష్టంపై సమాచారం సేకరణ.,ఆరోగ్యం: వర్షాకాలంలో ఏర్పడే సీజనల్ రోగాల నివారణకు అవసరమైన మందులు,వైద్య సిబ్బంది సన్నద్ధతపై సమీక్ష.,రేషన్ కార్డుల పంపిణీ: ప్రస్తుత పంపిణీ కార్యక్రమం పురోగతి, లబ్ధిదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేయడంపై ఆదేశాలు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం అన్ని శాఖలు సమన్వయంగా పని చేస్తూ రైతులకు,పౌరులకు అవసరమైన సేవలు సమర్థవంతంగా అందించేందుకు జిల్లాలో చర్యలు తీసుకుంటు న్నామని,యూరియా కు సంబంధించి సలహాలు సూచనలకు 8977741771 కాల్ చేయవచ్చునని,భారీ వర్షాలకు సంబంధించి సలహాలు సూచనలకు 18004251939 టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతీ రోజూ వ్యవసాయ శాఖకు సంబంధించి స్టాక్ వివరాలు డిస్ప్లే చేయాలనీ,టోల్ ఫ్రీ నెంబర్ స్థానిక రైతువేదికల్లో,బస్టాండ్,కలెక్టరేట్ లలో ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. వర్షా ప్రభావంతో ఎలాంటి ఆస్తి,ప్రాణ,ట్రైబల్ ప్రాంతాల గిరిజనులకు,రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మండలానికి ఒక అధికారిని నియమించాలని అన్నారు. రేషన్ కార్డులు ఈ నెల 25 వ తేది నుండి వచ్చే నెల 10 వ తేదీ వరకు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని,ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు,చెరువులలో నీటి శాతం ఎంత ఉంది,తదితర ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని,సీజనల్ వ్యాదులు ప్రబలకుండా వైద్యాధికారులను అప్రమత్తం చేయాలనీ,డాక్టర్లు,మందులు అందుబాటులో ఉంచాలని,గ్రామాల్లో ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత గిరిజనుల పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.




# జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు మండల కేంద్రాలలో రేషన్ కార్డుల పంపిణీ..... సీఎం రేవంత్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు మండల కేంద్రాలలో రేషన్ కార్డుల పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్ కార్డుల పంపిణీ వంటి పలు అంశాల పై, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, వాకాటి శ్రీహరి, సీతక్క, శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఖమ్మం జిల్లాలో మూడు గంటల వ్యవధిలో 39 సెంటీ మీటర్ల భారీ వర్షం పడిందని, ప్రస్తుతం కూడా అటువంటి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ కలెక్టర్ లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ సాగు పనులు సజావుగా జరిగేందుకు అవసరమైన ఎరువులు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం, నీటిపారుదల శాఖ ద్వారా రైతులకు సాగునీరు విడుదల పై కలెక్టర్లు దృష్టి సారించాలని అన్నారు. జూలై 21 వరకు మన రాష్ట్రంలో దాదాపు 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని, గత 3 రోజులు గా వర్షాలు ఎక్కువ కురుస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అప్రమత్తం చేయాలని, జిహెచ్ఎంసి పరిధిలో హైదరా ఆధ్వర్యంలో 150 బృందాలను సిద్ధం చేశామని అన్నారు. నగరంలో వర్షాలు ఉన్నప్పుడు ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిడుగు పాటుకు మరణాలు సంభవిస్తున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వర్షాలు వచ్చినప్పుడు చెట్ల కింద స్తంభాల దగ్గర ఉండకుండా చూడాలని అన్నారు. పిడుగు పాటుతో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని, దీనికోసం పోలీసు అధికారులు వెంటనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలని అన్నారు. వర్షాకాలంలో వచ్చే అంటూ రోగాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ముఖ్యంగా ఐటీడీఏ గిరిజన ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని అన్నారు. నీటి నిల్వ లేకుండా చూడాలని, ఎక్కడైనా వర్షపు నీరు నిల్వ ఉంటే అక్కడ ఆయిల్ బాల్స్ వంటివి స్థానిక సంస్థల ద్వారా వేయాలని అన్నారు. డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి వరకు వైద్యులు సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని , ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా పరిధిలో ఉన్న ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు అధికంగా నిర్వహించాలని, ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేసి పనితీరు పర్యవేక్షించాలని అన్నారు. అత్యవసర సమయంలో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు నిధులు కూడా అందుబాటులో పెట్టడం జరుగుతుందని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మన ప్రాజెక్టులలో నీరు నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సంవత్సరం మన రాష్ట్రంలో దేశంలోనే అత్యధికంగా రెండు కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వారి ఉత్పత్తి చేశామని అన్నారు. గోదావరి బేసిన్ లో ప్రాజెక్టులలో నీరు తక్కువగా ఉందని, ఇక్కడ నీరు వృధాగా పోకుండా ప్రాజెక్టులలో ఎప్పటికప్పుడు నింపాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా అందుబాటులో ఉండాలని అన్నారు. విత్తనాల, ఎరువులు అక్రమ స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలి విత్తనాల అమ్మే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో ఎరువుల స్టాక్ ఎంత అందుబాటులో ఉందో కలెక్టర్ రెగ్యులర్ గా ప్రకటనలు విడుదల చేయాలని, ప్రతి ఎరువుల షాప్ వద్ద స్టాక్ వివరాలు నోటీసు బోర్డులు పెట్టాలని, పోలీస్ అధికారులను నియంత్రణకు పెట్టాలని అన్నారు. ఎరువుల లభ్యత పై అసత్య ప్రచారాలను గట్టిగా తిప్పి కొట్టాలని సీఎం పేర్కొన్నారు. రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతులు ముందస్తుగా ఎరువుల స్టాక్ పెట్టుకోకుండా అవగాహన కలిగించాలని అన్నారు. 20 నుంచి 25 శాతం ఎరువులు వ్యవసాయ అవసరాల కోసం కాకుండా ఇతర అంశాలకు, డీజిల్ వాహనాలలో పొగ తగ్గించేందుకు సబ్సిడీ ఎరువులు వినియోగిస్తున్నట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారని సీఎం అన్నారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ సబ్సిడీ ఎరువులు దారి మళ్ళించకుండా చూడాలని అన్నారు. వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అంశాలకు యూరియా వినియోగిస్తే కఠినంగా వ్యవహరించాలని క్రిమినల్ కేసుల నమోదు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఎరువుల అంశంలో ఫిర్యాదులను నమోదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ జిల్లాలలో ప్రచారం చేయాలని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా దాదాపు 7 లక్షల రేషన్ కార్డులను, 31 లక్షల లబ్ధిదారులతో మంజూరు చేసామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 96 లక్షల 96 వేల రేషన్ కార్డులు ఉన్నాయని, 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధిదారులు రేషన్ కార్డు ఉపయోగిస్తున్నారని అన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఉన్నప్పుడు ప్రజలు ఎక్కువ పట్టించుకోలేదని బ్లాక్ మార్కెట్లో పోయేదని, ప్రస్తుతం సన్న బియ్యం సరఫరా చేయడంతో చాలా డిమాండ్ వచ్చిందని, ప్రజలు తప్పనిసరిగా రేషన్ తీసుకుంటున్నారని సీఎం సంతోషం వ్యక్తం చేశారు. జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు మండల కేంద్రాలలో అధికారికంగా రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, వీటిలో తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ పాల్గొనేలా చూడాలని సీఎం తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒక చోట ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి, ఒక చోట పాల్గోనేలా కలెక్టర్ కోఆర్డినేట్ చేసుకోవాలని సీఎం తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్డిఓ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ కిందిస్థాయి సిబ్బంది అధికారులు ప్రజలను కలెక్టర్ అప్రమత్తం చేయాలని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దుల మండలాల వద్ద చెక్పోస్ట్ ఏర్పాటు చేయాలని ఆర్డీ వోలను కలెక్టర్ ఆదేశించారు. ముస్తాబాద్– సిద్దిపేట మార్గంలో గంభీరావుపేట – కామారెడ్డి మార్గంలో.. రుద్రంగి –కోరుట్ల మార్గంలో బోయిన్పల్లి – కరీంనగర్ మార్గంలో చెక్పోస్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్ల మరమ్మతుకు అవసరమైన మెటీరియల్ను సిద్ధంగా ఉంచుకోవాలని ఆర్ అండ్ బి, పి ఆర్ ఈఈ లను కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు రాధాబాయి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సివిల్ సప్లై డిఎం రజిత, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిషోర్, సీ పీ ఓ శ్రీనివాసాచారి, ఆర్ అండ్ బి, పి ఆర్ ఈఈ లు వెంకట రమణయ్య, సుదర్శన్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి రజిత, డీ సీ హెచ్ ఎస్ పెంచలయ్య ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

## అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు

**అమరావతి,జూలై21(సమయజ్యోతి):**

ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సుల్లో జీరో ఫేర్ టికెట్ ఇవ్వాలని సంబంధిత అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఏ రాష్ట్రాలకు ఎంత భారం అనే అంశంపై చర్చించారు. ఉచిత ప్రయాణంతో లబ్ధి, 100 శాతం రాయితీ వివరాలను మహిళలకు ఇచ్చే జీరో ఫేర్ టికెట్‌లో పొందుపర్చాలన్నారు. ఈ పథకం ఆర్టీసీకి భారం కాకుండా ఆదాయ మార్గాలు అన్వేషించాలని సూచించారు. నిర్వహణ వ్యయం తగ్గింపుతో సంస్థను లాభాల బాట పట్టించాలన్నారు. లాభాల ఆర్జన విధానాలు, మార్గాలపై కార్యాచరణ రూపొందించాలి. రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులే కొనుగోలు చేయాలని సూచించారు. . ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్‌గా మారిస్తే నిర్వహణ వ్యయం తగ్గుతుంది. ఇందుకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలి. అన్ని ఆర్టీసీ డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు–పై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. అయితే ఉచిత బస్సులను కేవలం జిల్లా ప్రయాణాలకే పరిమితం చేశారు. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఉచిత బస్సు సౌకర్యాన్నిప్రకటించారు. ఈ క్రమంలో విధివిధానాలను రూపొందిస్తున్నారు. ఆర్టీసిపై ఎం భారం పడుతుందనే విషయంపై చర్చిస్తున్నారు. అలాగే లెక్కలు తీస్తున్నారు.

# ఎపిలో నాలుగు రోజులపాటు భారీ వర్షాలు

## హెచ్చరించిన వాతావరణ శాఖ-వర్షాలతో రైతుల్లో చిగురించిన ఆశలు

**విశాఖపట్నం,జూలై21(సమయజ్యోతి):**

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రాబోయే నాలుగు రోజులపాటు- పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళా ఖాతంలో ఉపరితల ఆవర్తనంతోపాటు ద్రోణి ప్రభావం కొనసాగుతోందని, దీని వల్ల భారీ వానలు పడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఆదివారం వరకూ ఉన్న ఉపరితల ఆవర్తనం దక్షిణ ఒడిశా పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి నైరుతి దిశగా ప్రయాణిస్తోందని వెల్లడించారు. కర్ణాటక నుంచి దక్షిణ ఆంధ్రప్రదేశ్ వరకూ ద్రోణి ప్రభావం కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. ఏపీలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే జులై 24వ తేదీన ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావణ శాఖ అధికారులు వెల్లడించారు. అలాగే కాకినాడ, ఈస్ట్ గోదావరి, కోనసీమ, వెస్ట్ గోదావరి, ఏలూరు, కృష్ణా, అల్లూరి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోనూ వానలు పడతాయని చెప్పారు. దక్షిణ కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు ఉంటాయని.. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఇదిలావుంటే రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ పంటలు ఊపిరి పోసుకుంటున్నాయి. నైరుతి రుతుపవనాలు వచ్చాక.. జూన్‌లో తొలకరి వర్షాలకు చాలా మంది రైతులు విత్తనాలు నాటారు. ఇప్పటి వరకు 10లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగులోకి వచ్చాయి. కానీ మొన్నటి దాకా రుతుపవనాలు మందగించడంతో మెట్ట పంటలకు నీటి తడులు అందక పైర్లు ఎండుముఖం పట్టి రైతులు సతమత మవుతున్నారు. ఈ తరుణంలో ఉపరితల ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో రుతుపవనాల్లో కదలిక వచ్చి.. గత నాలుగైదు రోజులుగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు పడుతున్నాయి. దీంతో పైర్లన్నీ జీవం పోసుకునేందుకు అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా పత్తి, వేరుశనగ, కంది, మినుము, పెసర, చిరుధాన్యాల పంటలకు ఈ వర్షాలు మేలు చేస్తాయని రైతులు చెప్తున్నారు. చాలా రోజుల తర్వాత వర్షాలు పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో సాగు చేయాల్సిన మిగిలిన విస్తీర్ణంలో పంటలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసి, రాష్ట్రంలోని జలాశయాలకు నీరు చేరడంతో కృష్ణా, గోదావరి డెల్టాలోని ఆయకట్టుకు ఇరిగేషన్‌శాఖ కాలువల ద్వారా నీరు విడుదల చేసింది. దీంతో వరి సాగు ముమ్మరంగా జరుగుతోంది.

# వివేకా హత్య కేసులో విచారణ

## సిబిఐ అభిప్రాయం కోరిన సుప్రీం

**న్యూఢిల్లీ,జూలై21(సమయజ్యోతి):**



మాజీ మంత్రి వివేకా హత్య కేసు నిందితుల బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో మూడు అంశాలపై సీబీఐ అభిప్రాయాన్ని సుప్రీం ధర్మాసనం కోరింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సీబీఐ, సునీత సవాల్ చేశారు.సీబీఐ అభిప్రాయం చెప్పాక అవినాష్ రెడ్డి బెయిల్ రద్దుపై విచారిస్తామని పేర్కొంది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. తదుపరి దర్యాప్తు అవసరమని సీబీఐ భావిస్తుందా? లేదా? కోర్టుకు చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. ఏపీ ప్రభుత్వం కడప సెషన్స్ కోర్టులో వేసిన క్లోజర్ రిపోర్టుపైనా సీబీఐ అభిప్రాయాన్ని సుప్రీం ధర్మాసనం కోరింది. కేసు ట్రయల్, తదుపరి దర్యాప్తు ఏక కాలంలో కొనసాగించే అవకాశం ఉందా? అని సీబీఐ అభిప్రాయాన్ని న్యాయస్థానం అడిగింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న అవినాష్ రెడ్డి సహా పలువురి బెయిల్ రద్దు కోరుతూ సుప్రీంకోర్టులో వివేకా కుమార్తె సునీత, సీబీఐ పిటిషన్ దాఖలు చేశారు. అవినాష్ రెడ్డితో పాటు- పలువురు నిందితులకు గతంలో తెలంగాణ హైకోర్టు బెయిల్ ఇచ్చింది.

# అజ్ఞాతంలోకి మాజీమంత్రి పేర్నినాని

## పోలీసుల ముమ్మర గాలింపు

**అమరావతి,జూలై21(సమయజ్యోతి):**

హైకోర్టులోనూ ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించినా చుక్కెదురు కావడంతో పేర్ని నాని ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన కోసం గాలిస్తున్న ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. రప్పా.. రప్పా.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పేర్ని నానిపై కృష్ణా జిల్లా పామర్రు పీఎస్ లో టీ-డీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్టేషన్లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 8న పామర్రులో మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని రప్పా రప్పా అంటూ కొట్టిన డైలాగులు ఇంకా ఆయనను వెంటాడుతూనే ఉన్నాయి. ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రప్పా రప్పా అని చెప్పడం కాదు.. రాత్రికి రాత్రి చేసేయాలంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. పామర్రు కేసును కొట్టివేయాలంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, హైకోర్టు పేర్ని నాని విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది. అరెస్టు నుంచి ముందస్తు రక్షణ దక్కలేదని ఖంగుతిన్న పేర్ని నాని సైలెంట్‌గా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఈనెల 22న హైకోర్టు విచారణ తరువాత పేర్ని నాని వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

# సిట్ విచారణకు మాజీమంత్రి నారాయణస్వామి గైర్హాజరు

## అనారోగ్యంతో రాలేక పోతున్నట్లు సమాచారం

**విజయవాడ,జూలై21(సమయజ్యోతి):**

లిక్కర్ కేసులో సిట్ విచారణకు రాలేనని అధికారులకు మాజీ మంత్రి నారాయణస్వామి సమాచారమిచ్చారు. అనారోగ్యం, వ్యక్తిగత కారణాలతో రాలేక పోతున్నట్లు- ఆయన తెలిపారు. మూడు రోజుల క్రితమే ఆయనకు మద్యం కేసులో విచారణకు రావాలని సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈక్రమంలో సోమవారం ఉదయం 10 గంటలకు నారాయణస్వామి విజయవాడ ‘లోని కార్యాలయానికి రావాల్సి ఉంది. మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎక్సైజ్ మంత్రి కె. నారాయణ స్వామికి మూడు రోజుల క్రితం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ నోటీసులు జారీ చేసింది. సోమవారంఉదయం 10 గంటలకు సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. అయితే, అనారోగ్యం, వ్యక్తిగత కారణాల వల్ల విచారణకు రాలేకపోతున్నానని మాజీ మంత్రి నారాయణ స్వామి సిట్ అధికారులకు సమాచారం అందజేశారు. వాస్తవానికి సోమవారం మాజీ మంత్రి నారాయణస్వామి సిట్ కార్యాలయానికి హాజరు కావాల్సి ఉంది. కానీ, అనూహ్యంగా ఆయన విచారణకు రానని సిట్ అధికారులకు సమాచారమిచ్చారు. మంత్రిగా తన ప్రమేయం లేకుండానే నూతన మద్యం పాలసీని రూపొందించినట్లు- సిట్ అధికారులు భావిస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయన పాత్ర ఏమీ లేదని దర్యాప్తులో తేలడమే కారణం. అందుకే మద్యం కుంభకోణం కేసులో సాక్షిగా స్టేట్ మెంట్ ఇవ్వాలని మాజీ మంత్రి కె.నారాయణ స్వామికి సిట్ నోటీ-సులు జారీ చేసింది. లిక్కర్ స్కాం కేసు దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ భారీ కుంభకోణంలో 49 మందిని నిందితులుగా చేర్చారు. ఈ కేసులో రాజ్ కసిరెడ్డి(ఎ1) ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. తాజాగా వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి (ఎ4)ని అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ కేసులో పలువురు కీలక నిందితులపై విచారణ కొనసాగుతోంది. నూతన మద్యం పాలసీ పేరుతో గత జగన్ ప్రభుత్వం సుమారు రూ.3500 కోట్ల వరకూ కొల్లగొట్టినట్లు సిట్ అంచనా వేస్తోంది. ప్రతి నెలా రాజ్ కసిరెడ్డి రూ.50-60 కోట్ల వరకూ వసూలు ఎంపీ మిథున్ రెడ్డి, నాటి వైకాపా నేత విజయసాయిరెడ్డి (ఆ5), జగన్ సతీమణి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ ఆర్థిక వ్యవహారాలు చూసే గోవిందప్ప బాలాజీకి (ఆ33) అందజేసేవాడని వెల్లడించింది. మొత్తంగా ఈ కేసులో జగన్ మోహన్‌రెడ్డి అంతిమ లబ్దిదారుగా ఉన్నాడని సిట్ ఆదివారం విడుదల చేసిన 305 పేజీల ప్రాథమిక అభియోగపత్రంలో పేర్కొంది. త్వరలోనే సిట్ ఈ కేసుకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలు, స్టేట్‌మెంట్లు-, ఫోరెన్సిక్ రిపోర్ట్‌లు కోర్టుకు సమర్పించేందుకు సన్నాహాలు చేస్తోంది.

# గడికోట బాలిక హత్యకేసును ఛేదించిన పోలీసులు

## ప్రేమకారణంగా సోదరులే హత్యకు పాల్పడినట్లు గుర్తింపు

**కడప,జూలై21(సమయజ్యోతి):**

జిల్లాలోని గండికోటలో మైనర్ బాలిక హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్య జరిగి వారం రోజులు అవుతోంది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టి కేసును కొలిక్కి తెచ్చారు. బాలిక హత్య కేసులో సంచలన విషయాలు వెలుగుచూశాయి. బాలిక సోదరులే హంతకులని నిర్ధారించారు. ప్రేమ వ్యవహారం.. కుటుంబ పరవుపుతీస్తోందనే బాలికను ఆమె అన్నలు హతమార్చినట్లు- తెలిపారు. బాలిక, బాలిక లవర్ లోకేష్ వేర్వేరు కులాలు కావడం.. ఆస్థిపాస్తుల్లోనూ తమతో సరితూగరనే భావనలో బాలిక బంధువులు ఉండడం.. ఇవే హత్యకు కారణంగా భావిస్తున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితులను గుర్తించారు పోలీసులు.. ఇన్‌స్టాగ్రాం చాటింగ్ లోనూ హత్య వ్యవహారాన్ని గుర్తించారు. మరిన్ని సాంకేతిక ఆధారాలకోసం దర్యాప్తు కొనసాగుతున్నట్లు- తెలిపారు. వారం రోజుల కిందట గండికోటలో మైనర్ బాలిక వైష్ణవి శవంగా కనిపించిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ముందు ప్రియుడిని అనుమానించి విచారించారు. తర్వాత ప్రియుడి పాత్ర లేదని గుర్తించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేయగా అసలు నిందితులు దొరికిపోయారు.

# ఆధారాలతోనే ఎంపి మిధున్ రెడ్డి అరెస్ట్

## జిల్లాకో సైబర్ క్రైమ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు-లక్ష సిసి కెమరాలు ఏర్పాటు చేసే యోచన

## హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి

**శ్రీసత్యసాయి,జూలై21(సమయజ్యోతి):**



అవనీతిపై ఆధారాలు ఉంటేనే ఎవరినైనా అరెస్టు చేస్తారని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. ఎంపి మిధున్ రెడ్డి అరెస్ట్ విషయంలో అన్ని ఆధారలతోనే ముందుకు వెళ్లామని అన్నారు. సోమవారం ఆమె శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఏర్పాటు-చేసిన మీడియా సమావేశంలో వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టు, రిమాండ్ గురించి మాట్లాడారు. ఏమైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని చెప్పారు. కోర్టు రిమాండ్ విధించిందంటే మనం గౌరవించాలని అన్నారు. న్యాయస్థానానికి సరైన ఆధారాలు ఇవ్వకపోతే రిమాండ్‌కు ఇవ్వరు కదా అని అన్నారు. ప్రొసీజర్ యథావిధిగా సాగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం మూడు సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లు పనిచేస్తున్నాయని చెప్పారు. జిల్లాకు ఒక సైబర్ క్రైమ్ పీఎస్ ఏర్పాటుకు సిఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారని తెలిపారు. రాష్ట్రంలో లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. ప్రతి నియోజకవర్గం, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు-కు చర్యలు తీసుకుంటున్నట్లు- వివరించారు. ప్రతి పోలీసు స్టేషన్‌కు రెండు డ్రోన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత తెలిపారు. ఒక ఎంపీని అరెస్ట్ చేయాలంటే అన్ని ఆధారాలు ఉంటే తప్ప అరెస్టు చేయమన్నారు. పక్కా ఆధారాలతోనే ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేశామన్నారు. అక్రమ అరెస్ట్ అంటే.. సీఎం చంద్రబాబును అరెస్ట్ చేసిందని ఆమె వ్యాఖ్యానించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించి ఫైళ్ల దహనం కేసు, అటవీ భూముల్లో అక్రమ నిర్మాణాలపై కేసులో ఇంకా విచారణ కొనసాగు తూనే ఉందని.. ఇంకా ముగిసిపోలేదని ఆమె అన్నారు. గండికోటలో బాలిక హత్య కేసుకు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో నిందితుడి పై క్లారిటీ వస్తుందని హోం మంత్రి తెలిపారు. ఇక గుహ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ అని చెప్పి సాక్షి క్యాలెండర్ విడుదల చేసారు అన్నారు. అలాగే డిఫెన్స్ పరిశ్రమ మడకశిరలో రాబోతుందని ఆమె తెలిపారు. ఒక్క ఛాన్స్ అన్న పాపానికి 20 సంవత్సరాలు రాష్ట్రం వెనక్కి వెళ్లనుందని ఆమె గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాట్లాడారు. నాడు- నేడు కార్యక్రమం అంతా పైన పటారం.. లోన లోటారంలా ఉందని ఆమె వ్యాఖ్యానించారు. ఆ కార్యక్రమంపై విచారణ చేస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని ఆమె అన్నారు. భార్యలు భర్తలను హత్య చేసే విషయంలో టీవీ సీరియల్స్ , సినిమాల ప్రభావం ఎక్కువగా ఉందని మాట్లాడారు. వీటిపైనా ఆలోచన చేయల్సి ఉందన్నారు.

# స్మార్ట్ మీటర్ల బిగింపు దుష్ప్రచారం: గొట్టిపాటి

**ఒంగోలు,జూలై21(సమయజ్యోతి):**

వైకాపా హయాంలో నాసిరకం మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన అందరికీ శిక్ష పడుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మద్యం కుంభకోణం కేసులో చట్టం తన పని తాను చేస్తోందని చెప్పారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం లేదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించబోమని గతంలో చెప్పాం. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం లేదు. ఎక్కువ విద్యుత్ బిల్లులు వస్తున్నాయని వైకాపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. వైకాపా హయాంలో 9 సార్లు విద్యుత్ బిల్లులు పెంచారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ’తల్లికి వందనం’ ద్వారా రూ.10వేల కోట్లు- అందజేశాం. విద్యార్థులకు కావాల్సిన వస్తువులన్నీ మంచి క్వాలిటీ-తో ఇచ్చాం. రాజకీయ నాయకుల ఫొటోలు వేయకుండా విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశాం. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది.‘ అని గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.



# సీమకు జగన్ చేసిందేమీ లేదు: మంత్రి డోలా

**నంద్యాల,జూలై21(సమయజ్యోతి):**

రాయలసీమకు మాజీ సీఎం జగన్ చేసిందేమీ లేదని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టుతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. నంద్యాల జిల్లా కొత్తపల్లె మండలం దుద్యాలలో ’సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ఆయన వివరించారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు.

# అధికారంలో ఉన్నా..లేకున్నా టిడిపి ప్రజలపక్షం

## ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం మాది

## ఇంటింటికి తెలుగుదేశంలో మంత్రి అచ్చన్నాయుడు

**విశాఖపట్నం,జూలై21(సమయజ్యోతి):**



తెలుగుదేశం అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం ప్రజల పక్షాన పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. టీడీపీ అధికారంలో ఉంటే ప్రజల కోసం పని చేస్తామని.. ప్రతిపక్షంలో ఉంటే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి పోరాడుతామని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దుర్మార్గుడైన జగన్మోహన్ రెడ్డి పాలనను ప్రజలు తిరస్కరించి కూటమి ప్రభుత్వానికి ప్రజలు విజయం అందించారని తెలిపారు. 2019లో 151 సీట్లు గెలవడంతో జగన్ ప్రభుత్వానికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. జగన్ రెడ్డి ఇప్పటికైనా నీ పద్ధతి మార్చుకో అని వార్నింగ్ ఇచ్చారు. సోమవారం పెందుర్తి మండలం గుర్రంపాలెం గ్రామంలో పెందుర్తి ఇన్‌చార్జ్ గండి బాబ్జి ఆధ్వర్యంలో ’ఇంటింటికీ తెలుగుదేశం, సుపరిపాలనలో ముందడుగు’ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన ఎలా ఉంది..?, సంక్షేమ పథకాలు సరిగ్గా అందుతున్నాయా లేదా..? అని మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం ’సుపరిపాలనలో ముందడుగు’ అని ఉద్ఘాటించారు. 2019 తర్వాత తెలుగుదేశం చాలా ఇబ్బందులకు గురైందని చెప్పుకొచ్చారు. ఒక సమయంలో టీ-డీపీ ఏమవుతుందోనని ఆవేదన చెందానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ వైసీపీ పార్టీ లాగా గాలికి పుట్టలేదని.. ఎన్టీ రామారావు స్థాపించిన పార్టీ ఇదని ఉద్ఘాటించారు. 2019 తర్వాత ఏపీ పేరు చెబితే.. ఇతర రాష్ట్రాల వారు భయపడే పరిస్థితి ఉండేదని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు లాంటి ఒక అనుభవం ఉన్న ముఖ్యమంత్రి ఉండటం ఏపీ ప్రజలు చేసుకున్న అదృష్టమని అభివర్ణించారు. రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉన్న సమయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 200 అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని చెప్పారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇచ్చి మాట నిలబెట్టుకున్నారని ఉద్ఘాటించారు. ఏపీలో 67 లక్షల మంది పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు మూడు వాయిదాల్లో రూ. 20000లు ఇస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

# టీమిండియాకు గాయాల బెడద



ఇంగ్లాండ్ పర్యటనలో టీమిండియా ప్లేయర్లు గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే టెస్ట్ సిరీస్‌లో 2-1 తేడాతో వెనుకబడిన భారత్‌కు స్టార్ ప్లేయర్ల గాయాలపాలు కావడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. టెస్ట్‌ల్లో అరంగేట్రం కోసం చూస్తున్న అర్ష్‌దీప్ సింగ్ ప్రాక్టీస్ సెషన్‌లో బౌలింగ్ చేస్తుండగా.. చేతికి గాయమైనట్లు తెలుస్తోంది. స్టార్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా గాయపడినట్లు సమాచారం. ఆదివారం జిమ్‌లో కసరత్తులు చేస్తున్న సమయంలో లిగమెంట్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీంతో అర్ధాంతరంగా భారత్‌కు వస్తున్నట్లు చెబుతున్నారు. ఈ సిరీస్‌లో రెండు టెస్టులు ఆడిన నితీశ్ కుమార్ రెడ్డి.. బౌలింగ్‌లో మూడు వికెట్లు తీయగా, బ్యాటింగ్‌లో 45 పరుగులు చేశాడు. ముఖ్యంగా మూడో టెస్ట్‌లో మంచి ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లో కీలక వికెట్లు తీయడంతోపాటు బ్యాటింగ్‌లో పర్వాలేదనిపించాడు. ఈ నేపథ్యంలోనే అన్షుల్ కాంబోజ్‌కు బీసీసీఐ పిలుపునిచ్చింది. మరోవైపు రెండో టెస్ట్‌లో అదరగొట్టిన ఆకాశ్‌దీప్ సైతం గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో నాలుగో టెస్ట్‌లో అతడు ఆడేది అనుమానంగా మారింది. ఈ ముగ్గురి ప్లేయర్ల గాయాల గురించి బీసీసీఐ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. పనిభారం కారణంగా జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌కు విశ్రాంతినివ్వాలని డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో కీలక ఆటగాళ్ల గాయాలు తలనొప్పిగా మారాయి. ఇప్పటికే మూడో టెస్ట్‌లో గాయపడిన రిషభ్‌పంత్ ఇంకా పూర్తి కోలులేదని సమాచారం. నాలుగో టెస్ట్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా దిగుతాడని చెబుతున్నారు. కరుణ్ నాయర్ వరుసగా మూడు టెస్ట్‌ల్లో విఫలం కావడంతో సాయిసుదర్శన్ లేదా అభిమాన్యు ఈశ్వరన్‌ను తుది జట్టులో తీసుకోవాలని మాజీలు సూచిస్తున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకపోవడంతో ఈ సిరీస్ ప్రారంభానికి ముందు ఇంగ్లాండ్ ముందు భారత్ కనీసం నిలుస్తుందా..? అని అందరూ అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఈ అనుమానాలన్ని పటాపంచల్ చేస్తూ తొలి టెస్ట్‌లోనే టీమిండియా అదరగొట్టింది. గెలుపు అవకాశాలను సృష్టించుకుని.. నాలుగు రోజులు ఆధిపత్యం చెలాయించి చివరి రోజూ అనూహ్యంగా ఓటమిపాలైంది. ఇక రెండో టెస్ట్‌లో ఇంగ్లాండ్‌కు చుక్కలు చూపిస్తూ.. భారీ తేడాతో విజయం సాధించింది.మూడోటెస్ట్‌లోనూ అద్భుతంగా పోరాడింది. గెలుపు అంచుల వరకు వచ్చి.. చివరకు 22 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీంతో సిరీస్‌లో నిలవాలంటే నాలుగో టెస్ట్‌లో భారత్ కచ్చితంగా గెలిచి తీరాల్సిందే. ఇలాంటి తరుణంలో ఆటగాళ్ళు గాయాలు కావడంతో తుది జట్టు ఎలా ఉంటుందని ఉత్కంఠ నెలకొంది. బ్యాటింగ్ వరకు పెద్దగా సమస్యలు లేకపోయినా.. బౌలింగ్‌లో ఎవరిని తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. మాంచెస్టర్ వేదికగా ఈ నెల 23వ తేదీ నుంచి నాలుగో టెస్ట్ మొదలుకానుంది.



# బీసీసీఐ ప్రెసిడెంట్ రేసులో ఆ ఇద్దరు?

బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీకి జులై 19తో 70ఏళ్లు నిండాయి. దీంతో బోర్డు రాజ్యాంగం ప్రకారం గరిష్ట వయోపరిమితి దాటడంతో బిన్నీ తన పదవికి అనర్హుడవుతారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ లో జరిగే వార్షిక సర్వసభ్య సాధారణ సమావేశం..వరకు బిన్నీ కొనసాగుతాడా లేదా ఉపాధ్యాక్షుడు రాజీవ్ శుక్లాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి ఆయన తప్పుకుంటాడా అనే విషయంపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది. అంతేకాదు జాతీయ క్రీడా బిల్లు ముసాయిదా రూపంలో మరో ట్విస్ట్ బిన్నీకి అనుకూలంగా మారే ఛాన్స్ కనిపిస్తోంది. సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో నూతన క్రీడా బిల్లును ప్రవేశపెడతారు. ఈ డ్రాఫ్ట్ ప్రకారం పాలకుల వయోపరిమితిని 70 నుంచి 75ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందినట్లయితే..జాతీయ క్రీడా సమాఖ్యలకు అన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది.బీసీసీఐ కూడా ఎన్ఎస్ఎఫ్ కావడంతో చట్టం ప్రకారం నడుచుకోవాల్సిందే. అంతర్జాతీయ క్రికెట్ మండలి నిబంధనల్లో కూడా ఎక్కడా వయోపరిమితులను విధించలేదు. ఇలా చూస్తే బోర్డు అధ్యక్షుడిగా బిన్నీ మరో 5ఏళ్లు కొనసాగే అవకాశం ఉంటుంది. ఇదే విషయంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, న్యాయనిపుణులతో బిన్నీ ఈపాటికే చర్చించినట్లు తెలుస్తోంది. మరోవైపు బోర్డులో చక్రం తిప్పగల పెద్దలు కూడా మరో 3ఏళ్లు బిన్నీనే కొనసాగించాలని భావిస్తున్నారట. కొందరు మాత్రం కొత్త బిల్లు వచ్చేంత వరకు శుక్లాకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలనుకుంటున్నారట.

# సొంతగడ్డపై అదరగొట్టిన బంగ్లాదేశ్

## 7 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించిన బంగ్లాదేశ్

సొంతగడ్డపై బంగ్లాదేశ్ అదరగొట్టింది. ఇటీవల శ్రీలంకతో టీ20 సిరీస్ నెగ్గిన బంగ్లా తాజాగా పాకిస్థాన్?తో సిరీస్?ను? కూడా ఘనంగా ఆరంభించింది. మూడు టీ20ల సిరీస్?లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్?లో బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో పాకిస్థాన్?ను మట్టికరిపించింది. దీంతో బంగ్లాదేశ్ సిరీస్?లో లీడ్?లోకి దుసుకెళ్లగా, పాకిస్థాన్ ఖాతాలో అత్యంత చెత్త రికార్డు చేరింది.ఈ మ్యాచ్?లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 19.3 ఓవర్లలో 109 పరుగులకే ఆలౌటైంది. బంగ్లా బౌలర్ల దెబ్బకు పాక్ బ్యాటర్లు విలవిల్లాడారు. ఓపెనర్ ఫకర్ జమాన్ (44 పరుగులు) టాప్ స్కోరర్. ఈ మ్యాచ్?లో పాకిస్థాన్?లో ముగ్గురు బ్యాటర్లే రెండంకెల స్కోర్ సాధించారు. మిగతా ప్లేయర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ఈ క్రమంలోనే పాక్ చెత్త రికార్డు నమోదు చేసింది. టీ20 చరిత్రలో తొలిసారి బంగ్లాదేశ్ చేతిలో ఆలౌట్ అయ్యింది.గతంలో పాకిస్థాన్- బంగ్లాదేశ్ ఈ మ్యాచ్ కాకుండా 22సార్లు టీ20 ఫార్మాట్?లో తలపడ్డాయి. ఇందులో అత్యధికంగా పాక్ 19సార్లు నెగ్గగా, బంగ్లాదేశ్ 3 మ్యాచ్?ల్లో విజయం సాధించింది. కానీ గతంలో పాక్?ను బంగ్లాదేశ్ ఎప్పుడు కూడా ఆలౌట్ చేయలేదు. పాక్ జట్టులోని పదికి పది వికెట్లు నేలకూల్చడం బంగ్లాదేశ్?కు ఇదే తొలిసారి కావడం విశేషం.మ్యాచ్ విషయానికొస్తే, ఛేదనలో బంగ్లాకు కూడా పాక్ గట్టి షాక్ ఇచ్చింది. 7 పరుగులకే రెండు కీలక వికెట్లు పడగొట్టి మ్యాచ్?పై ఆసక్తి పెంచింది. బౌలర్ సల్మాన్ మిర్జా తంజీద్ హసన్ తమిమ్ (1), లిట్టన్ దాస్ (1)ను పెవిలియన్ పంపి పాక్?కు బ్రేక్ ఇచ్చాడు. కానీ, పర్వేజ్ హొసన్ (56 పరుగులు), తౌహిత్ హ్రిదయ్ (36) బంగ్లాను ఆదుకున్నారు. ఈ ఇద్దరూ మూడో వికెట్?కు 73 పరుగులు జోడించి మ్యాచ్?ను తమవైపునుకు తిప్పుకున్నారు.12.3 ఓవర్ వద్ద హ్రిదయ్ ఔటైనా, జెకర్ అలీ (15)తో కలిసి పర్వేజ్ మ్యాచ్ పూర్తి చేశాడు. 110 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 15.3 ఓవర్లలోనే అందుకుంది. హాఫ్ సెంచరీతో అదరగొట్టి, నాటౌట్?గా నిలిచిన పర్వేజ్ హొసన్?కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. తాజా విజయంతో మూడు మ్యాచ్?ల సిరీస్?లో బంగ్లా 1-0తో లీడ్?లోకి దూసుకెళ్లింది. ఇరుజట్లు మధ్య రెండో టీ20 మ్యాచ్ మంగళవారం (జూలై 22)ఢాకా వేదికగా జరగనుంది.






# టీమిండియాకి మరో ఫ్రంట్ లైన్ బౌలర్ అవసరం

## భారత వెటరన్ క్రికెటర్ రహానే వ్యాఖ్య

ఇంగ్లాండ్ తో జరుగుతున్న టెస్టు సిరీస్ లో భారత్ ప్రస్తుతం వెనుకంజలో ఉన్న సంగతి తెలిసిందే. ఐదు మ్యాచ్ ల ఈ సిరీస్ లో ఇంగ్లాండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. అయితే ఈనెల 23 నుంచి మాంచెస్టర్ లో జరిగే నాలుగో టెస్టులో విజయం సాధించాలంటే టీమిండియాలో కచ్చితంగా ఒక బిగ్ మార్పు జరగాల్సిందేనని వెటరన్ భారత క్రికెటర్ అజింక్య రహానే వ్యాఖ్యానించాడు. ముఖ్యంగా బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయాలని పేర్కొన్నాడు. మూడో టెస్టులో ఎనిమిదో నెంబర్ వరకు బ్యాటింగ్ చేయగల ఆటగాళ్లను పెట్టుకుని 193 పరుగుల టార్గెట్ ను ఛేదించలేక టీమిండియా చతికిలపడింది. ముఖ్యంగా ముగ్గురు ఆల్ రౌండర్లతో ఆడటంతో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ లోనూ అంతగా సత్తా చాట లేక పోయింది. అందుచేత బౌలింగ్ విభాగాన్ని పటిష్టం చేసినట్లయితే బాగుంటుందని పేర్కొన్నాడు. భారత ప్లేయింగ్ లెవన్ లో కీలక మార్పు చేయాలని రహానే సూచించాడు. ముఖ్యంగా ఫ్రంట్ లైన్ బౌలర్ ను మరొకరిని ఆడించాలని పేర్కొన్నాడు. బ్యాటింగ్ లో విఫలమవుతున్న నితీశ్ రెడ్డి స్థానంలో ఏస్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ను ఆడించాలని సూచించాడు. ఇంగ్లాండ్ లో 20 వికెట్లను త్వరగా తీయగలిగితేనే విజయం సాధించే అవకాశముందని, మూడో టెస్టులో కేవలం ముగ్గురు మాత్రమే ఫ్రంట్లైన్ బౌలర్లు జస్ ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ లతో మాత్రమే ఆడింది. నితీశ్ తోపాటు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ లను ఆడించింది. అయితే వీరు ముగ్గురు బ్యాటింగ్ ఆల్ రౌండర్లే కావడం విశేషం.భారత హెడ్ కోచ్ గౌతం గంభీర్ కు ఆల్ రౌండర్లపై మక్కువ ఎక్కువ. అందుకే జట్టులో ముగ్గురు ఆల్ రౌండర్లు ఉన్నారని తెలుస్తోంది. అయితే ఈ ముగ్గురిలో నితీశ్ బౌలింగ్ లో ఫర్వాలేదనిపిస్తుండగా, బ్యాటింగ్ లో తేలిపోయాడు. అటు జడేజా బ్యాటింగ్ లో ఆకట్టుకుంటున్నప్పటికీ, బౌలింగ్ లో అంతగా రాణించడం లేదు. ఇక సుందర్.. మాత్రం రెండు విభాగాల్లో ఉనికి చాటుకున్నాడు. దీంతో నాలుగో టెస్టులో టీమిండియా కూర్పుపై సందిగ్ధత ఏర్పడింది. ఈ క్రమంలో పలువురు మాజీలు పలు రకాలుగా సలహాలు ఇస్తున్నారు. ఇక రెండో టెస్టులో ఓడిన ఇంగ్లాండ్ అద్భుతంగా పుంజుకుని, విజయం సాధించిందని రహానే ప్రశంసించాడు. ముఖ్యంగా జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ వంద శాతం ఎఫర్ట్సు అన్ని విభాగాల్లో, మ్యాచ్ అంతటా కొనసాగించాడని పేర్కొన్నాడు. ముఖ్యంగా రిషభ్ పంత్ రనౌట్ విషయం ఈ విషయాన్ని నిరూపిస్తుందని పేర్కొన్నాడు. ఇక నాలుగో టెస్టులో గెలిచి, సిరీస్ నెగ్గాలని ఇంగ్లాండ్ సమరోత్సాహంతో ఉంది. మరోవైపు ఈ మ్యాచ్ లో ఇరుజట్లు తప్పనిసరిగా పలు మార్పులతో బరిలోకి దిగే అవకాశం ఉంది. స్పిన్నర్ షోయబ్ బషీర్ గాయపడటంతో అతని స్తానంలో మరో ఆటగాడిని ఇంగ్లాండ్ ఆడించ బోతోంది. ఇక భారత్ కూడా మరో ఎగస్ట్రాబౌలర్ తో ఆడే అవకాశముంది. అలాగే వరుసగా విఫలం అవుతున్న కరుణ్ నాయర్ పై కూడా వేటు పడ వచ్చు.



# అఫ్రిది తన వంకర బుద్ధిని బయటపెట్టాడు

ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ రెండవ సీజన్ జూలై 18న ప్రారంభమైంది. ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ సిరీస్‌లో భారత్ పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జూలై 20న జరగాల్సింది. కానీ ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని దృష్టిలోఉంచుకుని భారత ఆటగాళ్ళు ఈ మ్యాచ్ ఆడటానికి నిరాకరించారు. అంతేకాదు ఈ మ్యాచ్‌ను బహిష్కరించాలని డిసైడ్ అయ్యారు. దీంతో యాజమాన్యం భారత జట్టు ముందు తలవంచాల్సి వచ్చింది. చివరికి మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ రద్దుకు ప్రధాన కారణాల్లో ఒకటి పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది. కొంతకాలం క్రితం అఫ్రిది సోషల్ మీడియాలో భారత్ పై విషం కక్కాడు. ఈ ఛాంపియన్ జట్టులో అఫ్రిది కూడా ఉన్నారు. అయితే ఈ మ్యాచ్ రద్దైన తర్వాత మరోసారి స్పందించాడు అఫ్రిది. భారత్, పాకిస్తాన్ మధ్య జరగనున్న ఈ మ్యాచ్ గురించి షాహిద్ విషం కక్కాడు. ఈ మ్యాచ్ రద్దుతో భారత జట్టులోని చాలా మంది ఆటగాళ్లు కూడా నిరాశ చెందారని, జట్టులోని ఒక ఆటగాడి కారణంగా వారు ఈ నిర్ణయం తీసుకున్నారంటూ ఆరోపణలు చేశారు. విలేకరుల సమావేశంలో భారత జట్టు కూడా ఈ మ్యాచ్ ఆడలేకపోవడం పట్ల నిరాశ చెందిందని.. దీనికి భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ కారణమంటూ అఫ్రిది వ్యాఖ్యలు చేశారు. ఈ లీగ్‌లో పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో తాను పాల్గొనబోనని శిఖర్ జూలై 11న బహిరంగంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. షాహిద్ అఫ్రిది ధావన్‌ను కుళ్ళిన గుడ్డు అంటూ పిలిచాడు. అతను టీం ఇండియా ఆటగాళ్లను చెడగొట్టాడని కూడా అఫ్రిది ఆరోపించాడు. "క్రీడలు దేశాలను దగ్గర చేస్తాయి. మీరు క్రీడలలోకి రాజకీయాలను తీసుకువస్తే, మీరు ఎలా ముందుకు వెళతారు" అంటూ ప్రశ్నించారు. సంభాషణ లేకుండా ఏదీ సరైనది కాదని, విషయాలను సరిదిద్దడానికి ఇటువంటి మ్యాచ్‌లు నిర్వహిస్తాయని అన్నారు. కానీ ప్రతి అంశాన్ని పాడు చేసే విధంగా మాట్లాడకూడదు. ఇంతటితో అఫ్రిది ఊరుకోలేదు.. అగ్నికి ఆజ్యం పోస్తూ ధావన్ తన దేశానికి ఇబ్బంది కలిగించే వ్యక్తి అంటూ సంచలన ఆరోపణలు చేశాడు. భారత జట్టు ఆడాల్సిన అవసరం లేకపోతే వారు ఇక్కడికి ఎందుకు వచ్చారు. వారు ఇంట్లోనే ఉండి ఉడాలి కదా అంటూ ప్రశ్నించారు. చివరగా అఫ్రిది మాట్లాడుతూ.. దాదాపు అందరు భారత ఆటగాళ్లు మ్యాచ్ కు ముందు శిక్షణ పొందారని అన్నారు. కేవలం ఒకే ఒక్క ఆటగాడి కారణంగానే వారు మ్యాచ్ నుంచి వైదొలిగారని నేను భావిస్తున్నాను. దీనిపై భారత జట్టు కూడా చాలా కోపంగా ఉంది.వారందరూ ఇక్కడ ఆడటానికి వచ్చారు. మీరు దేశానికి మంచి రాయబారిగా ఉండాలని.. ఇబ్బందికి కారణం కాకూడదని నేను మీకు చెప్తున్నాను అంటూచెప్పుకొచ్చాడు అఫ్రిది.

# రిషబ్ పంత్ అంటే ఇంగ్లండ్ జట్టుకు కూడా భయం




ఇండియా, ఇంగ్లండ్ జట్ల మధ్య సిరీస్‌లో నాలుగో మ్యాచ్ జులై 23 నుంచి మాంచెస్టర్‌లో జరగనుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్ ఎలా ఉంటుందనేది పెద్ద ప్రశ్నగా మారింది. గత మ్యాచ్‌లో వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ వేలికి గాయం కావడంతో అతను వికెట్ కీపింగ్ చేయలేకపోయాడు. ఇప్పుడు మాంచెస్టర్‌లో రిషబ్ పంత్ ఆటపై ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, జస్‌ప్రీత్ బుమ్రా ప్రదర్శన చాలా అద్భుతంగా ఉంది. అయితే టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ మాట్లాడుతూ.. ఇంగ్లండ్ జట్టు ఈ ముగ్గురితో కాదు.. మరో భారత ఆటగాడికి భయపడుతుందని అన్నారు. స్టార్ స్పోర్ట్స్‌తో సంజయ్ మంజ్రేకర్ మాట్లాడుతూ.. "పరిస్థితి ఎలా ఉన్నా రిషబ్ పంత్ తన శైలితో ఆడతాడు. అతనికి ఆ స్వేచ్ఛ ఇవ్వాలి. ఐదో స్థానంలో రిషబ్ పంత్ ప్రస్తుతం అతిపెద్ద ఆటగాడు. ప్రస్తుతం రిషబ్ పంత్ ఇంగ్లండ్ జట్టుకు కూడా భయం కలిగించే ఆటగాడు. మరోవైపు బ్యాటర్లు మంచి ప్రదర్శన చేయాలి. యశస్వి జైస్వాల్ తన ఫామ్‌ను సద్వినియోగం చేసుకోవాలి. గత మ్యాచ్‌లో ఎలా ఔటయ్యాడో ఆలోచించాలి?" అని సంజయ్ మంజ్రేకర్ అన్నారు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గురించి సంజయ్ మంజ్రేకర్ మాట్లాడుతూ.. "శుభ్‌మన్ గిల్ పాత్ర కూడా చాలా ముఖ్యమైనది. లార్డ్స్‌లో గిల్ విఫలమైనప్పటికీ టీమిండియా బ్యాటింగ్ బాగానే ఉంది. టీమిండియా బ్యాటింగ్ పూర్తిగా శుభ్‌మన్ గిల్‌పై ఆధారపడకపోవడం మంచి విషయం." అని ఆయన అన్నారు.ఈ టెస్ట్ సిరీస్‌లో రిషబ్ పంత్ మంచి ఫామ్‌లో కనిపిస్తున్నాడు.

# పెద్ది మూవీ కోసం రామ్ చరణ్ కసరత్తులు



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పెద్ది' సినిమా కోసం అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. ఇందులో చరణ్ డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా కోసం తాను వర్క్‌వుట్స్ చేస్తున్నట్లు- తెలుపుతూ రామ్ చరణ్ ఓ ఫొటో షేర్ చేశారు. ప్రస్తుతం అది వైరల్ అవుతోంది. జిమ్‌లో వర్క్‌వుట్స్ చేస్తోన్న ఫొటోను షేర్ చేసిన ఆయన ..'పెద్ది కోసం మారుతున్నాను ఇలా.. దృఢమైన సంకల్పం.. గొప్ప ఆనందం' అనే క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆయన న్యూలుక్ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ 'పెద్ది' గ్లింప్స్‌లోని కొన్ని సన్నివేశాలతోనే పాన్ ఇండియా స్థాయిలో సినిమాపై ప్రత్యేకమైన ఉత్సుకతని రేకెత్తించింది చిత్రబృందం. అందుకు దీటు-గానే బుచ్చిబాబు సినిమాని రూపొందిస్తున్నారు. తాజాగా చెర్రీ లుక్‌తో ఆ అంచనాలు మరింత పెరిగాయి.

# లక్కీ భాస్కర్ అనుకున్న విజయం సాధించలేదు


## నిర్మాత నాగవంశీ వెల్లడి




విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటించిన 'కింగ్‌డమ్' సినిమా జూలై 31న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ప్రస్తుతం ప్రమోషన్లలో బిజీగా ఉన్న నిర్మాత నాగవంశీ, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన గత చిత్రాల ఫ్లాప్‌ల గురించి ఓపెన్ అయ్యారు. నాగ వంశీ మాట్లాడుతూ.. ' 'లక్కీ భాస్కర్' సినిమాకు నేను ఊహించినంత వసూళ్లు రాలేదు. అలాగే 'గుంటూరు కారం'పై వచ్చిన ట్రోలింగ్ నాకు ఇంకా అర్థం కావడం లేదు. కానీ నేను తెలిసి చేసిన తప్పు 'రణరంగం'. శర్వానంద్ లవర్ బాయ్ ఇమేజ్ ఉన్న సమయంలో వయసున్న పాత్ర చేయించడం అంత మంచిదేం కాదు అని బాబాయ్ గారు హెచ్చరించారు. అయినా మేము కొత్తగా ప్రయత్నించాలనుకున్నాం. అది వర్కౌట్ కాలేదు. కానీ అది పూర్తిగా ఫెయిల్ అయింది. బహుశా ఆ పాత్రను రవితేజ వంటి వాళ్లు చేసిన, హిట్ అయ్యేదేమో. అలాగే 'ఆదికేశవ' సినిమా విషయంలో కూడా పెద్ద తప్పు చేశా. రిపేర్ చేయాలని ప్రయత్నించిన కుదర్లేదు. ఈ రెండు సినిమాలు ఎ˜ా కెరీర్‌లో చాలా ఖరీదైన తప్పులుగా మిగిలిపోయాయి' అని ఆయన గుర్తు చేసుకున్నారు. తన తప్పులను నిస్సందేహంగా అంగీకరించి, తద్వారా భవిష్యత్తులో మంచి నిర్ణయాలు తీసుకోవాలన్న ప్రయత్నం చేస్తున్న నాగవంశీ మాటలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు, సినీ వర్గాలు ఆయన నిజాయతీని మెచ్చుకుంటు-న్నారు.

# కోట మృతి సినీరంగానికి తీరని లోటు

## కుటుంబ సభ్యులను పరామర్శించిన మోహన్ బాబు




ఇటీవల కోట శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మరణవార్త విని తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురయ్యానని నటు-డు మంచు మోహన్‌బాబు తెలిపారు. తన బ్యానర్‌లో వచ్చిన చాలా సినిమాల్లో కోటతో కలిసి నటించానన్నారు. ఆయనవిలన్‌గా, కామెడియన్‌గా ఏ డైలాగ్ అయినా అవలీలగా చెప్పే గొప్ప నటు-డు కోట అని మంచు మోహన్‌బాబు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలిగించాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్లు- చెప్పారు. అప్పటి, ఇప్పటి హీరోలతో కలిసి పని చేసిన కోట శ్రీనివాసరావుమరణం సినీ పరిశ్రమని విషాదంలో ముంచెత్తింది.ఇక కోట మృతి చెందిన సమయంలో చాలా మంది ప్రముఖులు ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. అయితే ఆ రోజు మోహన్ బాబు రాలేదు. ఈ సందర్భంగా సోమవారం కోట కుటుంబాన్ని పరామర్శించారు మంచు మోహన్ బాబు. ఈ సందర్భంగా ఆయన కోటతో తన సన్నిహిత అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కోట శ్రీనివాసరావు మా కుటుంబానికి అత్యంత ఆప్తులు. ఆయన మరణంనాకు వ్యక్తిగతంగా, మా కుటుంబానికి, అలాగే తెలుగు సినీ పరిశ్రమకు తీరనిలోటు- అని మోహన్ బాబు ఎమోషనల్‌గా మాట్లాడారు. ఆయన మరణించిన రోజు తాను హైదరాబాద్‌లో లేకపోవడం బాధాకరమని, ఆ వార్త తనను ఎంతో కలచివేసిందని చెప్పారు. కోటశ్రీనివాసరావు లేని లోటు- తీర్చలేనిది. ఆయన నటన, సంభాషణల శైలి తెలుగు ప్రేక్షకులహృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని మోహన్ బాబు భావోద్వేగంగా మాట్లాడారు.

# కోహినూర్ వజ్రం చుట్టూ తిరిగే కథ

## నటుడు పవన్ కళ్యాణ్ వెల్లడి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు- సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. ధర్మం కోసం పోరాడే యోధుడి పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్నారు. ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. నిధి అగర్వాల్, బాబీ డియోల్ ముఖ్య పాత్రలు పోషించారు. జూలై 24న విడుదల కానున్న 'హరి హర వీరమల్లు' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. తాజాగా చిత్రం బృందం ఘనంగా పాత్రికేయుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ' సినిమా గురించి క్లుప్తంగా చెప్పాలంటే 'కృష్ణా నది తీరంలో కొల్లూరులో దొరికిన కోహినూర్ వజ్రం హైదరాబాద్ సుల్తాన్ల దగ్గరకు ఎలా వచ్చింది? ఆ తర్వాత ప్రయాణం ఎలా జరిగింది? ఈ నేపథ్యంలో జరిగే కథ ఇది. దీనికి పునాది వేసింది క్రిష్ జాగర్లమూడి. ఒక మంచి కాన్సెప్ట్ తో వచ్చారు. ఆయన, రత్నం వచ్చి ఈ కథ చెప్పినప్పుడు నచ్చి వెంటనే ఓకే చేశాను. అయితే కరోనా అనేది సినిమాపై తీవ్ర ప్రభావం చూపించింది. నేను ఎ.ఎం. రత్నంని దగ్గరనుండి చూశాను. ఒకప్పుడు ఆయన వెంట నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, హీరోలు, దర్శకులు తిరిగేవారు. ఖుషి సినిమా సమయంలో మాకు ఒక నెల ముందే ప్రీ ప్రొడక్షన్ అయిపోయింది. మాకు అంత సౌకర్యాన్ని ఇచ్చారు. అలాంటి వ్యక్తి నలిగిపోతుంటే నాకు బాధేసింది. ఇది డబ్బు గురించో, విజయం గురించో కాదు మన వాళ్ళ కోసం, సినీ పరిశ్రమ కోసం నమ్మి నిలబడటం. కొన్ని కారణాల వల్ల క్రిష్ గారు ఈ సినిమా పూర్తి చేయలేకపోయినప్పటికీ ఒక మంచి కాన్సెప్ట్ తో ఈ సినిమాకి పునాది వేసిన ఆయనకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు' అని అన్నారు.



# మండుటెండల్లో 53 రోజులు క్లైమాక్స్ షూటింగ్





మెగా సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏఎం రత్నం నిర్మాణంలో తెరకెక్కిన పీరియాడికల్ యాక్షన్ మూవీ 'హరిహర వీరమల్లు' చిత్రం జులై 24న విడుదల కానున్నది. ఐదేళ్లుగా షూటింగ్ జరుపుకుంది. ఇక సినిమా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో హీరోయిన్ నిధి అగర్వాల్ , నిర్మాత ఏఎం రత్నం వరుస ప్రమోషన్లు చేసారు. అయితే తనకెంతో ఇష్టమైన నిర్మాత ఏఎం రత్నం కోసం పవన్ కళ్యాణ్ తన పాత పంథాని పక్కన పెట్టుకుని చాన్నాళ్ల తర్వాత మీడియా ముందుకు రావడం విశేషం. ప్రెస్‌మీట్‌లో తన మనసులోని భావాలను పంచుకున్నారు. హరిహర వీరమల్లు సినిమాకు సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించిన ఆయన, ఈ ప్రాజెక్ట్ పట్ల తన కమిట్‌మెంట్, ఇండస్ట్రీపై తన ప్రేమను మరోసారి చాటారు. సినిమా బతకాలి' అన్న ఒక్క ఉద్దేశంతోనే ఈ ప్రెస్‌మీట్ ఏర్పాటు- చేశానని పవన్ స్పష్టం చేశారు. ప్రీ-రిలీజ్ తర్వాత ఈ అవకాశం దక్కుతుందో లేదో తెలియక, తన మనసులోని భావాలను పంచుకోవాలని అనిపించిందన్నారు. ఈ సినిమా ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో సాగిందని పవన్ తెలిపారు. కరోనా విజృంభించిన సమయంలో, షూటింగ్ స్తంభించడంతో పాటు- పలు సాంకేతిక, ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయన్నారు. దర్శకుడు క్రిష్, రచయిత సాయిమాధవ్ బుర్రా తపన చూసి, రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ, సినిమా పూర్తి చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. మండుటెండల్లో 57 రోజులు క్లైమామామాక్స్ షూట్ చేశాం. చాలా కాలం తర్వాత మళ్లీ మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేశా. ఈ సినిమా -ల్గ÷కె-మాక్స్ సీన్లు అందరికీ ప్రేరణ కలిగిస్తాయి అని పవన్ చెప్పుకొచ్చారు.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685